FLASH INDIA NEWS
www.flashindianews.com
# ఫ్లాష్ ఇండియా
తెలుగు దినపత్రిక
FLASH INDIA TELUGU DAILY
RNI NO. APTEL/2010/33229

**విలేకరులు కావలెను**

17 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారిగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక :78 | గురువారం 23.04.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-

# తెలంగాణలో విద్యా విప్లవం..

## ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి

- వయోజనుల్లో అక్షరాస్యత పెంపుపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ
- సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో విద్యా రంగంలో వేగంగా సంస్కరణలు
- విద్యా రంగంలో తెలంగాణ దూకుడు
- సీఎం రేవంత్ నేతృత్వంలో విద్యా రంగంలో వేగంగా సంస్కరణలు

05



**విద్యా రంగంలో సంస్కరణల జోరు.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో సమూల మార్పులు**

# మాజీ సీఎం కన్నుమూత..



- మాజీ సీఎం నాదెండ్ల కన్నుమూత
- వయోభారంతో చికిత్స పొందుతూ హైదరాబాద్లో మృతి
- నేడు పంజాగుట్ట శ్మశాన వాటికలో అంత్యక్రియలు
- సంతాపం ప్రకటించిన చంద్రబాబు, రేవంత్, పవన్ కల్యాణ్

05

# గవర్నర్ నిర్ణయం తర్వాతే...

- గవర్నర్ కోటా ఎమ్మెల్సీ కేసు మళ్లీ వాయిదా
- కొత్త గవర్నర్ నిర్ణయం కోసం కోర్టు వేచి చూస్తోంది
- అటార్నీ జనరల్ సమయం ఇవ్వాలని కోరారు
- మొదట ఒకరిని సిఫారసు గవర్నర్ తిరస్కారం
- హైకోర్టు పాత, కొత్త నిర్ణయాలు రెండూ రద్దు చేసింది

02



**తదుపరి విచారణ తేదీ జూలై 22**



- తమ అభిప్రాయాలను తీసుకో లేదన్న కేసీఆర్, హరీష్, ఐఏఎస్ అధికారులు
- పరువు ప్రతిష్టలను దెబ్బతీసేలా వ్యవహరించారని పిటిషన్
- హైకోర్టులో ప్రభుత్వ, ప్రతివాదుల వాదనలు
- తుదితీర్పు వెలువరించిన జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మోహియుద్దీన్ ధర్మాసనం

# కేసీఆర్, హరీష్ కు భారీ ఊరట

**పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై చర్యలు తీసుకోవద్దు**
**కాళేశ్వరంపై ఘోష్ కమిషన్ ఏర్పాటు చేసిన సర్కారు**



## కాళేశ్వరం కమిషన్ తీరు సరిగా లేదు

తెలంగాణ హైకోర్టులో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావుకు భారీ ఊరట కలిగింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణకు ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక తీర్పు వెలువరించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ చేపట్టిన ఘోష్ కమిషన్ ఎలాంటి నిబంధనలు పాటించలేదని హైకోర్టు తెలిపింది. కనుక ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు చేపట్టవద్దని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది.

03

# హైకోర్టు తీర్పుపై సుప్రీంకు రేవంత్ సర్కార్?

- హైకోర్టు తీర్పుతో కాళేశ్వరం కేసులో కొత్త మలుపు
- కమిషన్‌పై 'క్లీన్ చిట్' లేదంటూ ఉత్తమ్ స్పష్టం
- ఎన్డీఎస్ఏ , విజిలెన్స్ రిపోర్టులపై క్యాబినెట్ ఫోకస్
- తదుపరి చర్యలపై రేపటి భేటీలో కీలక నిర్ణయం
- కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుపట్టలేదు
- కొన్ని సాంకేతిక అంశాలనే కోర్టు ప్రస్తావించింది
- మంత్రుల అభిప్రాయాలు తీసుకుని తదుపరి చర్యలపై నిర్ణయం
- ఇప్పటికే సీబీఐ విచారణకు ప్రభుత్వం సిఫారసు

03

**కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ఎంత నిజమో అది కూలిపోవడం కూడా అంతే నిజం**





# ఆర్టీసీలో సమ్మె

- ఆగిపోయిన బస్సులు డిపోలకే పరిమితమైన బస్సులు
- సమస్యల పరిష్కారం కోరుతూ కార్మికుల సమ్మె
- రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలోనూ కొనసా గుతున్న స్ట్రైక్
- అరకొర బస్సులతో ప్రయాణి కులకు పాట్లు
- డిపోల వద్ద పోలీసుల బందోబస్తు

02

ప్రభుత్వం ఆర్టీసీ మధ్య జరిగిన చర్చలు విఫలం అవడంతో టీజీఎస్ఆర్టీసీ సమ్మెకు దిగింది. అర్ధరాత్రి నుంచి బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. నిన్న ప్రత్యేక కమిటీ కార్మిక సంఘాలతో నిర్వహించిన చర్చలు విఫలం కావడంతో సమ్మెకు దిగారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ బస్సుల డిపోలకే పరిమిత మయ్యాయి. ప్రభుత్వ రవాణాలో ఆర్టీసీ బస్సులు పాత్ర కీలకం. సమ్మె ప్రభావంతో మధ్య రాత్రి నుంచి బస్సులు రోడ్కెక్కలేదు. తమ డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె విర మించేది లేదంటూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. అద్దె బస్సులు మాత్రం యథావిధిగా నడుస్తు న్నాయి.

# ఆర్టీసీ సోదరులారా సమ్మె విరమించండి..

## చర్చలతో సమస్యలు పరిష్కరించుకుందాం



- సమ్మె విరమించాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు
- సమ్మె సమస్యకు పరిష్కారం కాదని అన్నారు
- 4 వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు
- 29 అంశాలకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది
- ఆర్టీసీ రోజుకు 65 లక్షల మంది ప్రయాణికులకు సేవలు అందిస్తోంది
- అందులో 45 లక్షల మంది మహిళలు ఉన్నారు
- సమ్మె వల్ల పేద, గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా విధుల్లో చేరాలని కార్మికులను కోరారు

02

రాష్ట్ర వ్యాప్తంగా టీజీఎస్ ఆర్టీసీ బస్సులు నిలిచి పోయాయి. సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వంతో నిన్న జరిగిన చర్చలు విఫలం కావడంతో అర్ధరాత్రి నుంచే బస్సులను నిలిపివేశారు కార్మికులు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా సమ్మె విరమిం చాలని ఆర్టీసీ కార్మికులకు మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రయాణికులకు గుడ్‌న్యూస్ చెప్పిన మెట్రో..

- ఆర్టీసీ సమ్మె కారణంగా బస్సులు డిపోలకే పరిమితం అయ్యాయి
- అద్దె బస్సులు ఉన్నా, అవి సరిపోక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు
- ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ మెట్రో కీలక నిర్ణయం తీసుకుంది
- మెట్రో రైళ్ల సర్వీసుల సంఖ్య పెంచాలని నిర్ణయించింది
- సాధారణంగా పీక్ అవర్స్‌లో 56 రైళ్లు నడుస్తాయి
- కానీ ఇప్పుడు రోజంతా 56 రైళ్లు నడపాలని నిర్ణయం తీసుకున్నారు
- ప్రయాణికుల ఇబ్బందులు తగ్గించేందుకు చర్యలు
- రాత్రి 11 గంటల తర్వాత కూడా మెట్రో సర్వీసులను పొడిగించే ఆలోచన

02

**మియాపూర్‌ఎ-ల్‌బీ నగర్: 4 నిమిషాలు 20 సెకన్లు**
**నాగోల్రా-యదుర్గ్: 3 నిమిషాలు 40 సెకన్లు**



# ఆర్టీసీ సోదరులారా సమ్మె విరమించండి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆర్టీసీ సోదరులకు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక విజ్ఞప్తి చేశారు. ప్రజా శ్రేయస్సు దృశ్య ఆర్టీసీ సమ్మె విరమించాలని కోరారు. సమ్మె సమస్యకు పరిష్కారం కాదు.. ప్రభుత్వం ఉన్నతమైనటువంటి వ్యక్తిత్వం గల నలుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. నాలుగు వారాల్లో కమిటీ నివేదిక ఇవ్వాలని ఆదేశించినట్లు తెలిపారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తామనడం పొరపాటని.. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 అంశాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి వ్యతిరేకత లేదన్నారు.. అన్ని వెంటనే పరిష్కారం అయ్యే అంశాలని తెలిపారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలు రెండు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.. ఈ రెండు అంశాల్లో పలు సాంకేతిక అంశాలు చర్చించాల్సి ఉందన్నారు. వారు అధ్యయనం చేయడానికి నాలుగు వారాల గడువు అడిగామని తెలిపారు. ఈ రెండు అంశాలు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి దగ్గర చర్చిస్తామన్నారు. ఆర్టీసీ విలీనం ఆలస్యం అయిన ఉద్యోగులకు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయని చెప్పారు. గుర్తింపు సంఘాల ఎన్నికల విషయంలో నాయకుల మధ్య అంతర్యుద్ధం నడుస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే గతంలో పెండింగ్‌లో ఉన్న 2017 పీఆర్సీ క్లియర్ చేశామని.. పెండింగ్ డీఏలు లేకుండా క్లియర్ చేశామన్నారు."2013 పెండింగ్ బాండ్స్ క్లియర్ చేశాం. రూ.1205 కోట్లు ఉన్న పీఎఫ్ బకాయిలను రూ.600 కోట్లకు తగ్గించాం. రూ.690 కోట్లు ఉన్న సీసీఎస్ బకాయిలను రూ.300 కోట్లకు తగ్గించాం. ఇవే కాకుండా నెల వారీగా పీఎఫ్, సీసీఎస్‌కి రూ.75 కోట్లు చెల్లిస్తున్నాం. ఉద్యోగులపై పని భారం పడకుండా ఉండడానికి 4538 ఉద్యోగాల నియామకాలు భర్తీ త్వరలోనే పూర్తవుతుంది. సుదీర్ఘ కాలంగా ఎదురు చూస్తున్న 1134 కారుణ్య నియామకాలు చేపట్టాం. గత ప్రభుత్వం లో వివిధ కారణాలతో శాశ్వతంగా సర్వీసు నుంచి రిమూవ్ అయిన వారిలో ఇప్పటి వరకు దాదాపు 250 మందికి తిరిగి ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది. అన్ని అంశాలు పరిష్కారం చేస్తాం. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు వద్దు. గత ప్రభుత్వంలో 10 సంవత్సరాలుగా ఆర్టీసీలో ఏం జరిగిందో కార్మికులందరికీ తెలుసు. ఆర్టీసీ లో ప్రయాణించింది పేదలు గ్రామీణ ప్రాంత ప్రజలు మన అక్కా చెల్లెల్లు. ప్రతి రోజు 65 లక్షల మంది ప్రయాణం చేస్తుంటే అందులో 45 లక్షల మంది మహిళలే ఉన్నారు. ఆర్టీసీ లో నిత్యం ఉపాధి కోసం విద్య, వైద్యం కోసం పోయే పరిస్థితి ఉంది. ప్రభుత్వం పక్షాన మరోసారి విజ్ఞప్తి చేస్తున్నా.. సమ్మె వద్దు. మిమ్మల్ని ఎవరు అడ్డుకోరు ప్రజాస్వామ్య పద్ధతిలో మీ నాయకులు నిరసన తెలుసుకోవచ్చు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవచ్చు. కానీ.. పేద ప్రజల ప్రయాణాలకు ఇబ్బందులు కలగజేయవద్దు. పేద ప్రజలకు కార్లలో పోయే స్తోమత లేదు. ప్రతి ఒక్క ఆర్టీసీ కుటుంబ సభ్యుడికి విజ్ఞప్తి చేస్తున్నా.. ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం తరుపున కొట్లాడి సాధించుకుందాం.." అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



# ప్రయాణికులకు గుడ్‌న్యూస్ చెప్పిన మెట్రో..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆర్టీసీ సమ్మెతో బస్సులు ఎక్కడికక్కడ డిపోలకే పరిమితం అయ్యాయి. అద్దె బస్సులు నడుస్తున్నా అవి పాక్షికంగా ఉండటంతో రోజువారీ ఉద్యోగాలు, వ్యాపారాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మెట్రో రైల్ కీలక నిర్ణయం తీసుకుంది. మెట్రో రైళ్ల సర్వీసుల ఫ్రీక్వెన్సీని గరిష్ట స్థాయికి పెంచాలని నిర్ణయించింది. ఆర్టీసీ సమ్మెను దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్ మెట్రో రైలు ఎల్‌టీఎంఆర్‌హెచ్ఎల్‌తో సంప్రదింపులు జరిపింది. దీంతో హైదరాబాద్ ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని తగ్గించేందుకు మెట్రో సర్వీసులను పెంచినట్లు హెచ్ఎంఆర్ఎల్ ఎండీ పేర్కొన్నారు.

**గరిష్టంగా 56 రైళ్లు:**

సాధారణ రోజుల్లో ఉదయం 8.00 గంటల నుండి 10.30 గంటల వరకు, సాయంత్రం 5.00 గంటల నుండి 8.00 గంటల వరకు పీక్ అవర్స్‌లో 56 రైళ్లు నడుస్తాయి. ఈ సమయంలో రెండు రైళ్ల మధ్య నిడివి 3 నిమిషాలు 40 సెకన్లు ఉంటుంది. నాన్-పీక్ అవర్స్‌లో మియాపూర్-ఎల్బీ నగర్ (C1) కారిడార్‌లో 4 నిమిషాలు 50 సెకన్లు, నాగోల్ -- రాయదుర్గ్ (C3) కారిడార్‌లో 5 నిమిషాలు 20 సెకన్ల నిడివితో 44 రైళ్లు నడుస్తున్నాయి. కానీ ఆర్టీసీ సమ్మెను దృష్టిలో ఉంచుకొని రోజంతా గరిష్టంగా 56 రైళ్లు నడపాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. మియాపూర్ -- ఎల్బీ నగర్ కారిడార్‌లో 4 నిమిషాలు 20 సెకన్ల గ్యాప్‌తో, నాగోల్-- రాయదుర్గ్ కారిడార్‌లో 3 నిమిషాలు 40 సెకన్ల గ్యాప్‌తో రైళ్లు నడుస్తాయని దీనితో పాటు ప్రజలకు కలిగే ఇబ్బందులను తగ్గించేందుకు రాత్రి 11.00 గంటల తర్వాత కూడా చివరి మెట్రో రైలు సర్వీసును పొడిగించే అవకాశాన్ని పరిశీలిస్తోందని తెలిపారు.

# గవర్నర్ నిర్ణయం తర్వాతే...

**ఢిల్లీ :** సుప్రీంకోర్టులో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకం కేసు విచారణ మరోసారి వాయిదా పడింది. బుధవారం (ఏప్రిల్ 22) న గవర్నర్ కోటా ఎమ్మెల్సీ నియామకం కేసును జస్టిస్ విక్రమ్ నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం..విచారణను జూలై 22కు మరోసారి వాయిదా వేసింది. ఈ కేసులో ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన అటార్నీ జనరల్.. ఎమ్మెల్సీల నియామకంలో కొత్త గవర్నర్ నిర్ణయం తీసుకునేందుకు కొంత సమయం ఇవ్వాలని సుప్రీంకోర్టు ధర్మాసనాన్ని కోరారు. కొత్త గవర్నర్ నిర్ణయం తర్వాత విచారణ కొనసాగించాలా? ముగించాలో సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీంతో తీర్పును జూలై 22 కు వాయిదా వేసింది సుప్రీంకోర్టు ధర్మాసనం.

**ఎమ్మెల్సీల నియామక వివాదం ఇదీ..**

గత బీఆర్ఎస్ సర్కార్ మంత్రివర్గం గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించి గవర్నర్‌కు సిఫారసు చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వ్యక్తులకు రాజకీయ నేపథ్యం ఉన్నదంటూ అప్పటి గవర్నర్ తమిళిసై ఈ సిఫారసును తిరస్కరిస్తూ.. 2023, సెప్టెంబర్ 19న ఉత్తర్వులు రిలీజ్ చేశారు. ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాసోజు, కుర్రా వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. ఇదే టైంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారడం... సీఎం రేవంత్‌రెడ్డి మంత్రివర్గం 2024 జనవరి 13న కోదండరాం, ఆమీర్ అలీఖాన్ పేర్లను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమిస్తూ సిఫారసు చేసింది. ఈ సిఫారసును గవర్నర్ ఆమోదించడంతో అదే ఏడాది జనవరి 27న ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ రిలీజ్ చేసింది.ఇదిలా ఉండగానే.. దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు.

దీనిపై ఇరువైపుల సుదీర్ఘ వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం.. గతేడాది 2025 మార్చి 17న 73 దాసోజు శ్రవణ్ కుమార్, కుర్రా సత్యనారాయణ నామినేషన్లను తిరసరిస్తూ గవర్నర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది. అలాగే.. కొత్తగా ఎమ్మెల్సీగా కోదండరాం, అలీఖాన్‌ను నియమించాలనే తీర్మానంతోపాటు వాళ్లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ఇచ్చిన గెజిట్ నోటిఫికేషన్‌ను కూడా రద్దు చేస్తున్నట్టు స్పష్టం చేసింది. ఆ తర్వాత ఎమ్మెల్సీ అభ్యర్థులుగా కోదండరాం, అలీఖాన్ల పేర్లను రాష్ట్ర మంత్రివర్గం మరోసారి సిఫారసు చేసింది. ఆ పేర్లను గవర్నర్ ఆమోదించడంతో కోదండరాం, అలీఖాన్ ఎమ్మెల్సీలుగా నియమితులయ్యారు. గవర్నర్ తీసుకున్న నిర్ణయం చట్ట వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని నీరుగార్చేలా ఉందంటూ దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ 2025 ఆగస్టు 4న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వీటిపై విచారించిన సుప్రీంకోర్టు.. తామిచ్చే తుది ఉత్తర్వులకు లోబడి ఎమ్మెల్సీల ఎంపిక ఉంటుందని మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. ఆ తర్వాత కోదండరాం, అలీఖాన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేశారు. మధ్యంతర ఉత్తర్వుల తర్వాత ఎమ్మెల్సీలుగా ప్రమాణం చేయడాన్ని బుధవారం విచారణలో సుప్రీంకోర్టు తప్పుపట్టింది.

అందుకే గతంలోని మధ్యంతర ఉత్తర్వులను సవరిస్తున్నట్లు ప్రకటించింది. ఇద్దరు ఎమ్మెల్సీగా ప్రమాణం చేయడంపై స్టే విధిస్తున్నట్లు తెలిపింది. ఏప్రిల్ 31తో ఆరు నెలల గడువు ముగుస్తున్న క్రమంలో కొత్త గవర్నర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని కోర్టుకు తెలిపారు అటార్నీ జనరల్.బుధవారం ఈ కేసును విచారించగా..కోదండరాం, అజారుద్దీన్ లపై కొత్త గవర్నర్ నిర్ణయం తీసుకునేందుకు సమయం ఇవ్వాలని అటార్నీ జనరల్ కోర్టును కోరారు. కొత్త గవర్నర్ నిర్ణయం తర్వాత విచారణ కొనసాగించాలా? ముగించాలో సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. తీర్పును జూలై 22 కు వాయిదా వేసింది సుప్రీంకోర్టు ధర్మాసనం.

# ఇరిగేషన్ శాఖ కీలక ప్రకటన

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక విషయంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పుపై రాష్ట్ర ఇరిగేషన్ శాఖ స్పందించింది. ఈ తీర్పు కేవలం సాంకేతిక అంశాలకు సంబంధించిందే తప్ప, ఎవరికీ క్లీన్‌చిట్ ఇవ్వలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నియామకాన్ని హైకోర్టు పూర్తిగా సమర్థించిందని తెలిపారు.ఆ కమిషన్ ఏర్పాటును ఎక్కడా తప్పుబట్టలేదని పేర్కొన్నారు. విచారణ నివేదికలో పేర్కొన్న కొందరు బాధ్యులపై చేసిన కామెంట్లకు సంబంధించి, వారికి నోటీసులు ఇవ్వలేదనే సాంకేతిక, విధానపరమైన అంశాలను మాత్రమే కోర్టు ప్రస్తావించిందని అన్నారు. నోటీసులు ఇవ్వని కారణంగా వారిపై చేసిన రిమార్క్స్ 'ఇన్ ఆపరేటివ్'గా ఉంటాయని కోర్టు సూచించిందని వెల్లడించారు. ఇది పూర్తిగా ప్రొసిజరల్ అంశమని ప్రభుత్వం పేర్కొంది. హైకోర్టు తీర్పు ఈ కేసులోని బాధ్యులెవరికీ క్లీన్‌చిట్ ఇవ్వలేదని, సీబీఐ విచారణకు ఎలాంటి అడ్డంకి లేదని ఇరిగేషన్ శాఖ స్పష్టం చేసింది.

**ప్రాజెక్టు వైఫల్యంపై ప్రభుత్వం ఆందోళన..**

రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు కేవలం మూడేళ్లకే కుంగిపోవడంపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజీ లో ఏడో బ్లాక్ కుంగిపోయిందని, అక్కడ తప్పు జరిగిందన్నది అక్షర సత్యమని పేర్కొంది. ప్రాజెక్టు సైట్ ఎంపిక, డిజైన్లు, నిర్మాణంలో లోపాలున్నాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ , విజిలెన్స్ కమిషన్ ఇప్పటికే నివేదికలు సమర్పించాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ కూడా సుదీర్ఘ విచారణ తర్వాత ప్రాజెక్టులోని లోపాలు, అవకతవకలు, బాధ్యుల వివరాలను వెల్లడించింది.

**సీబీఐ దర్యాప్తు కొనసాగింపు..**




బాధ్యులెవరో తేల్చాల్సిన బాధ్యత తమపై ఉందని పేర్కొంటూ ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టింది. విజిలెన్స్ , ఎన్డీఎస్ఏ , ఘోష్ కమిషన్ నివేదికల ఆధారంగా దర్యాప్తు జరపాలని ప్రభుత్వం ఇప్పటికే సీబీఐకి లేఖ రాసింది. ఈ మేరకు గతేడాది సెప్టెంబర్ 1న ఈ దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ ప్రభుత్వం జీవోతో పాటు నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. హైకోర్టు వెలువరించిన పూర్తి తీర్పును పరిశీలించిన తర్వాత ప్రభుత్వం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకోనుంది.

# తల్లిదండ్రులూ..బీ కేర్‌ఫుల్ !

**గజ్వేల్(మెదక్),ఫ్లాష్ ఇండియా :** తల్లిదండ్రులూ... మీ పిల్లలు ఏం చేస్తున్నారో గమనిస్తున్నారా? పని ఒత్తిడిలో పడి వారిని నిర్లక్ష్యం చేస్తున్నారా? ఉన్నత చదువుల కోసం పట్టణాలకు పంపిస్తున్నామని మీరు సంబరపడుతుంటే.. కొందరు విద్యార్థులు మాత్రం దారి తప్పి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. గజ్వేల్ పట్టణంలో మారుతున్న సామాజిక పరిస్థితులు భయాందోళన కలిగిస్తున్నాయి. చదువు కోసమని గ్రామాల నుంచి పట్టణానికి వస్తున్న యువతలో కొందరు క్లాసులకు డుమ్మా కొట్టి విచ్చలవిడి వ్యవహారాలకు పాల్పడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పార్కులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో కాలక్షేపం చేస్తున్నారు. మరికొందరు గంజాయి, డ్రగ్స్ వంటి ప్రాణాంతక వ్యసనాలకు బానిసలవుతున్నారు. చేతిలో ఉన్న మొబైల్ ఫోన్ వారిని తప్పుడు దారిలోకి నెడుతోంది. అనవసరమైన చాటింగ్‌లు, కాల్స్‌తో చిక్కుల్లో పడుతున్నారు. ఇటీవల వెలువడిన ఇంటర్ ఫలితాల్లో అమ్మాయిలు టాప్ ర్యాంకులు సాధిస్తుంటే, అబ్బాయిలు వెనుకబడిపోవడం గమనార్హం.

**నిబంధనలు గాలికి.. లాడ్జీల కక్కుర్తి!**

గజ్వేల్ పట్టణంలోని పలు లాడ్జీలు నిబంధనలను బేఖాతరు చేస్తున్నాయి. కేవలం డబ్బు కోసమే చూస్తూ మైనర్లు, మేజర్లన్న తేడా లేకుండా గదులను అద్దెకు ఇస్తున్నారు. ఎలాంటి గుర్తింపు కార్డులు అడగకుండా, రిజిస్టర్లలో వివరాలు నమోదు చేయకుండా యథేచ్ఛగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల ఓ మైనర్‌కు గది ఇచ్చిన కేసులో లాడ్జీ నిర్వాహకుడిపై కేసు నమోదు కావడం ఈ దుస్థితికి అద్దం పడుతోంది. ఒకవైపు కొందరు దారితప్పుతుంటే, మరికొందరు పట్టుదలతో చదువుతూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. గజ్వేల్‌లోని ఒక కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థికి 470కి గానూ 468 మార్కులు, రెండో సంవత్సరం విద్యార్థినికి 1000కి 995 మార్కులు రావడం వారి క్రమశిక్షణకు నిదర్శనం. ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**నిపుణుల సూచనలివే**

పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే తల్లిదండ్రులు ఈ కింది జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. పిల్లల మొబైల్ ఫోన్ వినియోగంపై నిఘా ఉంచాలి. వారు ఎవరితో స్నేహం చేస్తున్నారో, ఖాళీ సమయాల్లో ఎక్కడికి వెళ్తున్నారో గమనించాలి. అప్పుడప్పుడు అకస్మాత్తుగా కళాశాలకు వెళ్లి అధ్యాపకులతో మాట్లాడాలి. ముఖ్యంగా ఎస్ఎస్‌సీ ఇంటర్, డిగ్రీ వయసులో పిల్లల ప్రవర్తనపై అత్యంత శ్రద్ధ వహించాలి.

# 3 వేలకు కక్కుర్తి!



**శ్రీనగర్ :** పహల్గామ్ లో ఉగ్రదాడి జరిగి నేటికి ఏడాది. కానీ, ఆ మారణహోమం మిగిల్చిన విషాదం ఆ 26 కుటుంబాలను ఇంకా వెంటాడుతూనే ఉంది. అయితే.. ఆ ఉగ్ర ఘటనకు సంబంధించి మరో కోణం వెలుగులోకి వచ్చింది. ఇందులో ఇద్దరు స్థానికుల పాత్ర ఉన్నట్లు తేలింది. దాడికి పాల్పడిన ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదులకు వారు ఆశ్రయం కల్పించారని.. వారి గురించి చెప్పే అవకాశం ఉన్నా.. పోలీసులకు సమాచారం ఇవ్వకుండా రహస్యంగా ఉంచారని వెల్లడైంది. ఇందుకోసం వారు ₹3 వేలు తీసుకున్నట్లు ఎన్ఐఏ విచారణలో తేలింది.

**లోయలోని కంచె వెనకాల దాక్కున్న ముష్కరులు..**

గత ఏడాది ఏప్రిల్ 21వ తేదీ రాత్రి 10.30 గంటల సమయంలో స్థానికులు పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్ వద్ద ముగ్గురు ఉగ్రవాదులు ఆశ్రయం పొందారు. ఆ సమయంలో వారి వద్ద వద్ద ఆయుధాలు కనిపించాయి. ఉర్దూ, పంజాబీ కలగలిసిన భాష మాట్లాడారు. లష్కరే తోయిబా అగ్ర కిమాండర్, ప్రధాన నిందితుడు సాజిద్ జట్టే అలియాస్ అలీభాయ్ గురించి మాట్లాడుకున్నారు. తమ ప్రాంతంలో దాడి జరగడం ఖాయమని వారి మాటల్ని బట్టి అర్థమైనా.. స్థానికులు పోలీసులను అప్రమత్తం చేయకుండా మౌనంగా ఉండిపోయారని దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఐదు గంటల పాటు వారి వద్ద ఆశ్రయం పొందిన ఆ ముగ్గురు ఉగ్రవాదులు .. అక్కడే తినేసి వెళ్లిపోయారు. అందుకోసం ₹3 వేలు ఇచ్చారు. తర్వాత ఏప్రిల్ 22వ తేదీన దాడి జరగడానికి కొన్ని గంటల ముందు మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఆ ఉగ్రవాదులు బైసరన్ లోయలోని ఒక కంచె వెనకాల దాక్కొన్నారు. ఆ విషయాన్ని పర్వేజ్ అహ్మద్, బషీర్ అహ్మద్ గుర్తించారు. అప్పుడు కూడా పోలీసులకు కానీ.. స్థానిక టూరిస్ట్ ఆపరేటర్లకు కానీ వీరు సమాచారం ఇవ్వలేదని వెల్లడైంది.

**సంబంధం లేనట్లు ఉండిపోయారు..**

ఆ ఇద్దరూ తమ గుర్రాలు ఎక్కడానికి పర్యాటకులు ఎవరైనా వస్తారా? అని మాత్రమే చూసుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో కొందరు రాగానే వారిని పహల్గాంలోని బైసరన్ లోయకు తీసుకెళ్లారు. ఆ తర్వాత కొన్ని గంటలకు అక్కడ కాల్పుల మోత వినిపించడం, ఆ వాతావరణమంతా రక్తసిక్తమవడాన్ని చూశారు. దాంతో తమకేం సంబంధం లేదన్నట్టుగా నిశ్శబ్దంగా అక్కడినుంచి జారుకున్నారని తెలిసింది. ఎన్ఐఏ వారిని గత ఏడాది జూన్ 22న అరెస్టు చేసింది. డిసెంబర్లో ఫైల్ చేసిన ఛార్జ్ షీట్ సాజిద్ జట్ పేరుతో పాటు ఆ స్థానికుల పేర్లను చేర్చింది. కాగా, ఇప్పటికైనా స్థానికులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు ఎదురైనా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# ఆర్టీసీలో సమ్మె



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వం ఆర్టీసీ మధ్య జరిగిన చర్చలు విఫలం అవడంతో టీజీఎస్‌ఆర్టీసీ సమ్మెకు దిగింది. అర్ధరాత్రి నుంచి బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. నిన్న ప్రత్యేక కమిటీ కార్మిక సంఘాలతో నిర్వహించిన చర్చలు విఫలం కావడంతో సమ్మెకు దిగారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ బస్సుల డిపోలకే పరిమితమయ్యాయి. ప్రభుత్వ రవాణాలో ఆర్టీసీ బస్సులు పాత్ర కీలకం. సమ్మె ప్రభావంతో మధ్య రాత్రి నుంచి బస్సులు రోడ్డెక్కలేదు. తమ డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు సమ్మె విర మించేది లేదంటూ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. అద్దె బస్సులు మాత్రం యథావిధిగా నడుస్తున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అన్ని డిపోల వద్ద పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఆర్టీసీ కార్మికులకు రాజకీయ పార్టీల మద్దతు**

మరోవైపు. పలువురు రాజకీయ నాయకులు ఆర్టీసీ కార్మికులకు మద్దతు ప్రకటించారు. సమ్మెకు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. "ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరి ష్కరించాలి. ఎన్నికల హామీ మేరకు ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలి. ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేసి గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలి ఆగిపోయిన రెండు వేతన సవరణలను తక్షణమే అమలు చేయాలి. ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను తక్షణమే కొనుగోలు చేయాలి. కార్మికుల ఐక్య పోరాటం తోనే హక్కుల సాధన సాధ్యం." కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు.

**సత్వరమే పరిష్కరించాలని..**

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కమిటీ నాలుగు వారాల సమయం కోరగా.. అందుకు ఆర్టీసీ జేఏసీ అంగీకరించలేదు. తమ సమస్యలు సత్వరమే పరి ష్కరించాలని ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో డిపోలోనే బస్సులు నిలిచిపోయాయి. ఎంజీబీఎస్ కూడా ఆర్టీసీ జేసీ సమ్మె పిలుపుతో అర్ధరాత్రి నుంచి బస్సు సర్వీసులు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో జనజీవనం పూర్తిగా అస్తవ్యస్తంగా మారింది..

**ప్రయాణికుల కష్టాలు..**

ఉచిత బస్సు ప్రయాణం ఎక్కువమంది మహిళలు చేస్తూ ఉంటారు. ప్రతిరోజు 14.2 లక్షల మంది ఉచిత ప్రయాణం చేస్తున్నారు. చర్చలు విఫలం కావడంతో చాలామంది. అయోమయానికి గురవుతున్నారు. దీంతో వాళ్లు ఆటోలు,ప్రైవేట్ క్యాబ్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ సమయంలో ఆటో చార్జీల నియంత్రణ కూడా సాధ్యం కాక పోవచ్చు. మహిళలు, విద్యార్థులు ఇబ్బందులు తప్పడం లేదు.ఇది ఇలా ఉంటే మరోసారి సీనియర్ ఐఏఎస్ అధికారుల కమిటీ కార్మిక సంఘాల నేతలను చర్చలకు పిలిచే అవకాశం ఉంది.

# ఉగ్రదాడికి.. ఏడాది




**న్యూ ఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడి జరిగి నేటితో ఏడాది పూర్తయింది. కుటుంబాలతో పహల్గామ్లో విహరిస్తుండగా హఠాత్తుగా ఉగ్రమూకలు విరుచుకుపడి మతం పేరుతో 26 మంది పురుషులను పొట్టనపెట్టుకున్నారు. ఏడాది నుంచి 26 కుటుంబాలు తీవ్ర విషాదంలో మునిగిపోయాయి. ఈ సందర్భంగా ప్రధాని మోదీ పహల్గామ్ బాధితులను స్మరించుకున్నారు. బాధితులకు నివాళి అర్పించారు. గతేడాది ఇదే రోజున పహల్గామ్ ఉగ్ర దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని.. వారిని ఎప్పటికీ మరిచిపోలేమని... నష్టపోయిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లుగా పేర్కొన్నారు. దుఃఖంలోనూ.. సంకల్పంలోనూ ఒక దేశంగా ఐక్యంగా ఉన్నామన్నారు. భారతదేశం ఏ విధమైన ఉగ్రవాదానికి తలొగ్గదని.. ఉగ్రవాదుల హేయమైన కుట్రలు ఎన్నటికీ సఫలం కావన్నారు.

**అంతర్జాతీయంగా చర్చ**

గతేడాది ఇదే రోజున హిందువులను టార్గెట్ చేసుకుని 26 మంది పురుషులను ఉగ్రవాదులు చంపేశారు. భార్య, పిల్లల ముందే చంపేశారు. కొత్తగా పెళ్లైన జంటలను కూడా వదిలిపెట్టకుండా నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేశారు. ఈ ఘటన యావత్తు దేశంతో పాటు ప్రపంచాన్ని కలవరపాటుకు గురి చేసింది. ఈ పరిణామాన్ని భారత ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుంది. మే 7న పాకిస్థాన్పై ఆపరేషన్ సింధూర్ చేపట్టింది. ఈ ఘటనలో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. అంతేకాకుండా పాకిస్థాన్ వైమానిక స్థావరాలు ధ్వంసమయ్యాయి. మొత్తానికి నాలుగు రోజుల యుద్ధం తర్వాత పాకిస్థాన్ కాళ్ల బేరానికి రావడంతో భారత్ ప్రభుత్వం కాల్పుల విరమణకు అంగీకరించింది. అనంతరం పహల్గామ్లో కాల్పులకు తెగబడ్డ ముష్కరులను కూడా భద్రతా దళాలు అంతమొందించాయి.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# కేసీఆర్, హరీష్ కు భారీ ఊరట



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అంశంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ , మాజీ మంత్రి హరీశ్‌రావు లకు హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఇరు పక్షాల వాదనలు సుదీర్ఘంగా విన్న జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్ ధర్మాసనం కాళేశ్వరం ఎత్తిపోతలపై కమిషన్ ఏర్పాటును సమర్థిస్తూ.. అది చట్టబద్ధమేనని తెలిపింది. ఇక నివేదిక తయారుచేసే సమయంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎలాంటి నిబంధనలు పాటించలేదని కోర్టు అభిప్రాయపడింది. సెక్షన్ - 8 కింద నోటీసులు ఇవ్వకుండా నిరాధర ఆరోపణలు చేయడం కరెక్ట్ కాదని తెలిపింది. నివేదిక ఆధారంగా పిటిషనర్లపై ఎలాంటి చర్యలు తీకోవద్దని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా ఇదే కేసులో పిటిషన్లు దాఖలు చేసిన మాజీ సీఎస్ ఎస్కే జోషీతో పాటు నాటి సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్‌కు కూడా ఊరట లభించినట్లైంది. విచారణ సందర్భంగా పిటిషనర్ల తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. తమ క్లయింట్లను నివేదిక రూపొందించే సమయంలో సాక్షులుగానే వివరాలు అడిగారని కోర్టుకు తెలిపారు. తీరా చూస్తే.. తన క్లయింట్లు తప్పు చేసినట్లుగా కమిషన్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. కమిషన్ ఎంక్వైరీ యాక్ట్ -1952 (సెక్షన్-8B) (సెక్షన్-8C) ప్రకారం.. ఎవరినైనా సాక్షులుగా విచారించినప్పుడు వారిపై ఎలాంటి అభియోగాలు మోపకూడదని గుర్తు చేశారు. ఒకవేళ ఆ అభియోగాలు నిజమైతే వేరుగా ఒక్కొక్కరికి నోటీసు విచారించాల్సి ఉంటుందని పిటిషనర్ల తరపు న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. కాగా, బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నిర్మించి బ్యారేజీల్లో అవకతవకలపై విచారణ నిమిత్తం జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను నియమిస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవో నెం.6 సవాలు చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారులు స్మితా సభర్వాల్, ఎస్కే జోషిలు వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. ఈ మేరకు కేసీఆర్, హరీశ్‌రావుతో పాటు స్మితా సబర్వాల్, ఎస్కే జోషిలకు కూడా కోర్టు ఊరట కల్పించింది.

**పీసీ ఘోష్ రిపోర్టును చెత్తబుట్టలో వేయొచ్చు.. కేసీఆర్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు**

కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీల్లో జరిగిన అవకతవకలపై విచారణ నిమిత్తం ఏర్పాటు చేసిన జస్టిస్ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ నివేదిక విషయంలో మాజీ సీఎం కేసీఆర్ , మాజీ మంత్రి హరీశ్‌రావుకు ఊరట కల్పిస్తూ ధర్మాసనం నిర్ణయం తీసుకుంది. తీర్పు వెలువడిన అనంతరం కేసీఆర్ తరఫు న్యాయవాది గండ్ర మోహన్ రావు మీడియా ఎదుట కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ తీర్పుతో పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టును ఇక చెత్తబుట్టలో పడేయవచ్చని ఆయన అన్నారు. కమిషన్ విచారణలో సెక్షన్-8 నిబంధనలు పాటించలేదని కోర్టు గుర్తించిందని తెలిపారు. అయితే, కమిషన్ ఏర్పాటును మాత్రం కోర్టు సమర్థించిందని ఆయన పేర్కొన్నారు. ఈ కమిషన్ ఇచ్చిన నివేదికను పరిగణనలోకి తీసుకుని సీబీఐ విచారణ జరపడానికి వీల్లేదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన వెల్లడించారు. హైకోర్టు తీర్పుతో కేసీఆర్‌కు న్యాయపరంగా పెద్ద ఊరట లభించిందని గండ్ర మోహన్ రావు ధీమా వ్యక్తం చేశారు.

# ఇప్పుడే వస్తామని వెళ్లి తిరిగి రాలేదు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ సమ్మె కొనసాగుతున్న వేళ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక తొలిసారి నలుగురు ఐఏఎస్ అధికారుల కమిటీతోని ఏర్పాటు చేసి జేఏసీ నేతలను చర్చలకు ఆహ్వానించామన్నారు. సమావేశంలో నాలుగు గంటలపాటు విన్న నేతలు ఇప్పుడే వస్తామని మీటింగ్ నుంచి బయటకు వెళ్ల తిరిగి రాకపోగా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సమ్మెకు పిలుపు ఇచ్చారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇవాళ హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. కమిటీల పేరుతో కాలయాపన చేస-్తున్నామనడం పొరపాటు అని కార్మికులు లేవనెత్తిన 32 అంశాల్లో 29 వెంటనే పరిష్కారం చేయదగినవేనని వీటిపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ఆర్టీసీ విలీనం, గుర్తింపు సంఘాల ఎన్నికలనే అంశం పెండింగ్‌లో ఉందని స్పష్టం చేశారు.

**విధుల్లో చేరండి:**

ఆర్టీసీ జేఏసీ నేతలు నిరసన తెలపవచ్చు.. మిగతా వారు విధుల్లో చేరాలని పొన్నం ప్రభాకర్ అన్నారు. పేదల ప్రయాణాలకు ఆర్టీసీ కార్మికులు ఇబ్బందులు కలగజేయవద్దని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా డిమాండ్లు పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. ఆర్టీసీ పరిరక్షణ, ప్రజా శ్రేయస్సు కోసం కార్మికులు సమ్మె విరమించాలని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నానన్నారు. సమస్యకు సమ్మె పరిష్కారం కాదన్నారు. కార్మికుల సమస్య పరిష్కారానికి కమిటీ వేసి నాలుగు వారాల్లోపు నివేదిక ఇవ్వాలని కమిటీని ఆదేశించామన్నారు. ఉద్యోగం చేసే వారు తమ నిజమైన సమస్యలను చెప్పి పరిష్కారం కోరితే అయిపోయేది. కానీ జేఏసీ పేరుతో చేస్తున్నారు. కార్మిక సంఘాల అంశం కార్మిక చట్టంలో ఉండవచ్చు. కార్మిక నాయకత్వ చట్టాలు ఏమున్నాయో తెలియదు. చర్చలకు ఆహ్వానిస్తున్నామని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కానీ సంఘాల పేరు మీద మేం ఏం చేసినా చెల్లుతుందని అనుకుంటే ప్రభుత్వం ఎప్పుడు ప్రభుత్వమే అన్నారు.

**బీఆర్ఎస్ కుట్ర:**

ఆర్టీసీ సమ్మె బీఆర్ఎస్ నాయకుల కుట్ర అని ఆరోపించారు. కేసీఆర్ ఆదేశాల మేరకు హరీశ్ రావు ఈ కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా రాక్షసానందం పొందేందుకు ఎంతటికైనా దిగజారుతామనుకుంటే అది వారి ఖర్మ అన్నారు. ఇటీవల జగిత్యాల సభలో మహా లక్ష్మీ ప్రయాణం కేసీఆర్ అవహేళన గా మాట్లాడారు. వెంటనే ఆర్టీసీపై కుట్రలో భాగంగానే గతంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా ఉన్న హరీశ్ రావు సమ్మె పై కార్మికులను ప్రోత్సహించారు. మహా లక్ష్మీ పథకాన్ని అప్రతిష్టపాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సకల జనుల సమ్మె బీఆర్ఎస్ కోసం చేసింది కాదని తెలంగాణ కోసం చేసిందన్నారు.

# రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా:** కాళేశ్వరం అవినీతి విచారణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం అవకతవకలపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికకు సంబంధించి ఈరోజు(బుధవారం) తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఈ ప్రభుత్వ వైఫల్యాన్ని మరోసారి బట్టబయలు చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగినట్లు ఆధారాలు ఉన్నప్పటికీ.. వాటిని చట్టపరంగా సమర్థవంతంగా కోర్టు ముందు ప్రవేశపెట్టడంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. చట్టపరమైన ప్రమాణాలకు అనుగుణంగా తగిన ఆధారాలను సమర్పించలేకపోవడం వల్ల, కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వ నిర్లక్ష్యానికి, అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. కాంగ్రెస్ మాటల ప్రభుత్వమే తప్ప చేతల ప్రభుత్వం కాదని మరోసారి నిరూపితమైందని ఎద్దేవా చేశారు.

**హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు..**

ఈరోజు రాష్ట్ర హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని కిషన్‌రెడ్డి విమర్శించారు. అధికారంలోకి రాగానే.. కేసీఆర్, వారి కుటుంబ సభ్యులు, మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చేసిన అవినీతిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్, రేవంత్‌రెడ్డి పెద్ద పెద్ద హామీలు ఇచ్చారని ప్రస్తావించారు. కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తికావొస్తున్నా.. ఏ ఒక్క అవినీతి, అవకతవకలపై సమగ్ర దర్యాప్తు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని సీఎం అన్నారని చెప్పారు.. అలాగే, ఫార్ములా వన్ రేస్ పేరు మీద చేసిన ఖర్చులు, డ్రగ్స్ కేసు, భూ ఆక్రమణలు, భూ కేటాయింపులు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని.. అవినీతి సొమ్మును కక్కిస్తానని పదే పదే రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ వాటిపై ఒక్కటంటే ఒక్క చర్య కూడా ఎందుకు తీసుకోలేదని నిలదీశారు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులపై.. రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోకపోవడానికి కారణం.. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న దోస్తీయేనని విమర్శించారు.

**ఈ రెండు పార్టీలవి 'డూప్ ఫైటింగ్'**

ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు 'డూప్ ఫైటింగ్' చేస్తూ.. 'నేను గిచ్చినట్లు చేస్తా, నువ్వు ఏడ్చినట్లు చేయి' అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయని కిషన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలను రెండు పార్టీలు మోసం చేస్తున్నాయని ఆగ్రహించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ అవినీతి పాలన నుంచి విముక్తి కోసం.. మార్పు కావాలని కాంగ్రెస్‌కు ఓటేశారని తెలిపారు. కానీ రేవంత్ సర్కార్.. హామీలను మాటలకే పరిమితం చేస్తూ.. అవినీతికి పాల్పడిన వారిని ఎందుకు వదిలేస్తున్నారని ప్రశ్నల వర్షం కురిపించారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న కాంగ్రెస్ సర్కార్ అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ.. తెలంగాణ ప్రజాధనాన్ని అడ్డగోలుగా దోచుకుంటోందని ఆరోపించారు. అందుకనే బీఆర్ఎస్ హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలకు కాంగ్రెస్ సర్కార్ వెనుకాడుతోందని విమర్శించారు.

**తెలంగాణ ప్రజలకు రాజకీయ ద్రోహం..**

ఇది రేవంత్‌రెడ్డి పరిపాలనా వైఫల్యమని, ఇచ్చిన హామీలను విస్మరించి తెలంగాణ ప్రజలకు చేస్తున్న రాజకీయ ద్రోహమని కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత, అసెంబ్లీలో, బయట ప్రజలకు ఇచ్చిన హామీల ప్రకారం వెంటనే.. అవినీతి కేసుల్లో చట్టబద్ధమైన, పారదర్శకమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈరోజు హైకోర్టు తీర్పు నేపథ్యంలో.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. ఎన్నికల హామీలు ఎందుకు అమలు కాలేదు..? అని ప్రశ్నించారు. అవినీతి కేసుల్లో చర్యలు ఎందుకు ఆలస్యమవుతున్నాయి..? నిలదీశారు. దొంగలు, దొంగలు కలిసి తెలంగాణను దోచుకోవడంలో పోటీపడుతూ.. రాష్ట్రాన్ని నాశనం చేయాలని అనుకుంటున్నారా..? అని కిషన్‌రెడ్డి సెటైర్లు గుప్పించారు.



# సత్యమేవ జయతే

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అంశంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన 'X' (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అంతిమంగా ధర్మమే జయించిందని ఆయన పేర్కొన్నారు. 'సత్యమేవ జయతే.. ఎవరెన్ని కుట్రలు చేసినా న్యాయస్థానాల్లో అంతిమంగా ధర్మమే జయిస్తుందని ఇవాళ మరోసారి నిరూపితమైంది'అని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ప్రాథమిక హక్కులను, సహజ న్యాయ సూత్రాలను విస్మరిస్తూ కమిషన్ విచారణ జరిపిందని, దీనిని ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టడం శుభపరిణామమని ఆయన అన్నారు. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించేలా కమిషన్ చేసిన వ్యాఖ్యలు చెల్లవని కోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి, రాజకీయ కక్షసాధింపు కోసమే రేవంత్ రెడ్డి ప్రభుత్వం డ్రామాలు ఆడిందని, ఈ తీర్పుతో ఆ కుట్రలు బట్టబయలయ్యాయని హరీశ్ విమర్శించారు. ఇప్పటికైనా రాజకీయ దుష్ప్రచారం మానేసి, వెంటనే రెండు పిల్లర్ల మరమ్మతులు పూర్తి చేసి తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'ఎవరు అవునన్నా కాదన్నా... ముమ్మాటికీ కాళేశ్వరం తెలంగాణకు ప్రాణేశ్వరం', 'జై తెలంగాణ - జై కేసీఆర్' అంటూ పోస్ట్ చేశారు.

# హైకోర్టు తీర్పుపై సుప్రీంకు రేవంత్ సర్కార్?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఘోష్ కమిషన్ విషయంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించింది. ఈ తీర్పు నేపథ్యంలో తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు రాష్ట్ర మంత్రివర్గ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. హైకోర్టు ఇచ్చిన తీర్పులోని అంశాలను లోతుగా విశ్లేషించి, కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం వేయబోయే తదుపరి అడుగు గురించి ఈ భేటీలో కీలక నిర్ణయం తీసుకోనున్నారు. ఈ పరిణామాలపై ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తూ, బీఆర్ఎస్ నేతలు ఆశించినట్లుగా వారికి కోర్టు నుంచి ఎటువంటి 'క్లీన్ చిట్' లభించలేదని స్పష్టం చేశారు. కేసీఆర్ , హరీష్ రావు కోరినట్లుగా కమిషన్ ఏర్పాటును కోర్టు తప్పుబట్టలేదని, కేవలం కొన్ని సాంకేతిక అంశాలను మాత్రమే ప్రస్తావించిందని ఆయన వివరించారు. కమిషన్ నియామకాన్ని కోర్టు సమర్థించడం ప్రభుత్వ ధోరణికి దక్కిన విజయమని ఆయన అభిప్రాయపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ఎంత నిజమో, అది కూలిపోవడం కూడా అంతే నిజమని మంత్రి ఉత్తమ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. కేవలం జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగానే తాము చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం ఎక్కడా చెప్పలేదని, ఇప్పటికే తమ వద్ద నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ , విజిలెన్స్ విభాగానికి సంబంధించిన నివేదికలు సిద్ధంగా ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా ఎన్డీఎస్ఏ నివేదిక కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే వచ్చిందన్న విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. రేపు జరగబోయే కేబినెట్ సమావేశంలో మంత్రులందరి అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే ప్రభుత్వం తన తదుపరి అడుగు వేయనుంది. కోర్టు తీర్పులో పేర్కొన్న సాంకేతిక పరమైన అంశాలను ఎలా అధిగమించాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై సీబీఐ విచారణకు ప్రభుత్వం సిఫారసు చేసిన నేపథ్యంలో, కోర్టు తీర్పు తర్వాతి పరిణామాలను పరిగణనలోకి తీసుకుని విచారణ ప్రక్రియను ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై మంత్రివర్గం ఒక స్పష్టమైన నిర్ణయానికి రానుంది. మొత్తానికి, కాళేశ్వరం ప్రాజెక్టు చుట్టూ తిరుగుతున్న న్యాయపరమైన ఉత్కంఠకు రేపటి కేబినెట్ సమావేశం ఒక దిశను చూపే అవకాశం ఉంది.

# దుస్తుల కాంట్రాక్టులు 'టెస్కో'కే ఇవ్వండి..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ సర్కారుకు హైకోర్టు లో చుక్కెదురైంది. ప్రభుత్వ సంస్థలకు అవసరమైన దుస్తులు, బెడ్ షీట్లను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా సేకరించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని న్యాయస్థానం తప్పుబట్టింది. అన్ని ప్రభుత్వ అవసరాలకు ఖచ్చితంగా టెస్కో ద్వారానే చేనేత వస్త్రాలను సేకరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, ఇతర ప్రభుత్వ సంస్థలకు అవసరమైన దుస్తులు , బెడ్ షీట్ల ను ప్రైవేట్ సంస్థల ద్వారా సేకరించేందుకు ఈ నెల 2న ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ ఓ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయం వల్ల చేనేత కార్మికుల పొట్ట కొట్టినట్లవుతుందని వరంగల్ జిల్లాకు చెందిన వీరాంజనేయ హ్యాండ్లూమ్ వీవర్స్ సహా పలు సొసైటీలు హైకోర్టును ఆశ్రయించాయి.

**ధర్మాసనం కీలక వ్యాఖ్యలు..**

అయితే, ఆ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. చేనేత పరిశ్రమపై రాష్ట్రంలో దాదాపు 40 వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని కోర్టు పేర్కొంది. చేనేత పరిశ్రమను ఆదుకునేందుకే గతంలో అన్ని ప్రభుత్వ కాంట్రాక్టులు వారికే దక్కేలా జీవోలు తెచ్చారని, వాటిని అతిక్రమించడం సరికాదని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. ఈ మేరకు పీఎంయూ విడుదల చేసిన నోటిఫికేషన్ చెల్లదని హైకోర్టు స్పష్టం చేసింది.

**రిటైర్డ్ ఉద్యోగికి 4 వారాల్లో పెన్షన్ చెల్లించాలి.. లేదంటే 18% వడ్డీ!**

రిటైర్డ్ ఉద్యోగులకు అందవలసిన పదవీ విరమణ ప్రయోజనాల చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రంగారెడ్డి జిల్లా కోర్టులో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి ఆరు నెలల క్రితం రిటైర్ అయిన విజయ్ కుమార్ అనే ఉద్యోగికి రావాల్సిన రూ. 90 లక్షల బెనిఫిట్స్ ఇంకా అందలేదు. దీనిపై ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన న్యాయస్థానం, తెలంగాణ ప్రభుత్వతీరును తప్పుబడుతూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి కఠిన ఆదేశాలు జారీ చేసింది. విజయకుమార్‌కు రావాల్సిన పెన్షన్ ప్రయోజనాలను రాబోయే 4 వారాల్లోగా పూర్తిస్థాయిలో చెల్లించాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ నిర్ణీత గడువులోగా ఈ చెల్లింపులు జరగకపోతే, టోకెన్ జారీ చేసిన తేదీ నుంచి 18 శాతం వార్షిక వడ్డీతో కలిపి ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించింది. వృద్ధాప్యంలో తమ కష్టార్జితం కోసం ఉద్యోగులు కోర్టుల చుట్టూ తిరగడం సరికాదని, తక్షణమే ఈ బకాయిలను విడుదల చేయాలని న్యాయస్థానం ప్రభుత్వానికి ఆదేశించింది.

# పీసీ ఘోష్ కాదు ఇది పీసీసీ నివేదిక

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక అంశంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వాగతించారు. ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపు చర్యలకు గట్టి చెంపపెట్టు అని ఆయన అభివర్ణిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. రాజ్యాంగానికి, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా న్యాయస్థానాలు ఊరుకోవని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని ఆయన పేర్కొన్నారు. తాము ముందు నుంచి చెబుతున్నట్లే.. అది పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కాదు, ముమ్మాటికీ పీసీసీ నివేదిక అని ఇవాళ అక్షరాల నిజమని తేలిపోయిందని ఎద్దేవా చేశారు. రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న రేవంత్ తీరును హైకోర్టు తీర్పు ఎండగట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు. సహజ న్యాయ సూత్రాలను విస్మరించి, నిబంధనలకు పాతరేశారని కేటీఆర్ విమర్శించారు.

**ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి..**

తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టును రాజకీయ కారణాలతో రెండున్నరేళ్లుగా పడావు పెట్టారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా ముక్కు నేలకు రాసి, రాష్ట్రంలోని అన్నదాతలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోవద్దని హైకోర్టు స్పష్టం చేయడంతో, రాష్ట్ర ప్రభుత్వం పన్నిన రాజకీయ కుట్రలకు బ్రేక్ పడిందని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా కక్షసాధింపు రాజకీయాలు పక్కన పెట్టి, ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి చేసి రైతన్నలకు సాగునీరు అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని ప్రభుత్వానికి కేటీఆర్ హితవు పలికారు.

# చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యం



**వెల్గటూర్,ఫ్లాష్ ఇండియా :** చదువు ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను స్వయంగా పర్యవేక్షిస్తూ పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడంపై దృష్టి సారిస్తున్నారని రాష్ట్ర మంత్రి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. దీంతో ప్రభుత్వ విద్యపై పేద విద్యార్థుల తల్లిదండ్రుల్లో విశ్వాసం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికల కార్యక్రమంలో భాగంగా బుధవారం వెల్గటూర్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ సత్య ప్రసాద్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆహార నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకువస్తున్న సమూల మార్పులతో ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందన్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు.

**అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు**

ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్" నిర్మాణం, సాంకేతిక విద్య కోసం అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ఏర్పాటు, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక డైట్ ప్లాన్ రూపొందించామని తెలిపారు. కాస్మెటిక్ చార్జీలను కూడా పెంచినట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలపై తల్లిదండ్రుల నమ్మకం పెరిగిందని, ఇందుకు ఆన్లైన్ ద్వారా వస్తున్న దరఖాస్తులే నిదర్శనమని పేర్కొన్నారు. సంక్షేమ హాస్టళ్లలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటే తమ దృష్టికి తీసుకురావాలని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనపట్ల దినేష్, ఆర్డీవో మధుసూదన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దీదీ హెచ్చరికలు పనిచేస్తాయా?




పశ్చిమ బెంగాల్ లో మమత వర్సస్ బీజేపీ పోరు నువ్వా నేనా అన్నట్లుగా సాగుతోంది. 2021 లోనే ఈ రెండు పక్షాల మధ్య రాజకీయ యుద్ధం తారా స్థాయిలో జరిగింది. అప్పటి నుంచే 2026 ఎన్నికలే లక్ష్యంగా రెండు వైపులా వ్యూహాలకు పదును పెట్టారు. మమతా తన పాలన వైపే ప్రజలు మొగ్గు చూపుతున్నారనే ధీమాతో ఉన్నారు. అయితే, చొరబాట్లు.. ప్రభుత్వం పైన వ్యతిరేకత.. హిందుత్వ అజెండా తమకు కలిసి వస్తుందని బీజేపీ లెక్కలు వేస్తోంది. ప్రధాని మోడీ, అమిత్ షా సహా ముఖ్య నేతలంతా బెంగాల్ లో ఇప్పటికే ఉధృతంగా ప్రచారం చేస్తున్నారు. దీనికి తోడు ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తరువాత మమతకు అనుకూలంగా ఉన్న పలువురు అధికారులను బదిలీ చేయడం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇక సర్ కోసం వచ్చిన ఎన్నికల అధికారుల్ని ఘెరావ్ చేయడంతో.. సుప్రీంకోర్టు కూడా బెంగాల్ యంత్రాంగంపై సీరియస్ అయింది.బెంగాల్‌లో నాలుగోసారి అధికారం కోసం మమత చావో రేవో అన్నట్టుగా పోరాడుతున్నారు. ఎలాగైనా బెంగాల్ ఉట్టి కొట్టాలని బీజేపీ కూడా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ఒంటరి పోరు చేస్తున్న కాంగ్రెస్, ఎంఐఎం చీల్చే ఓట్లు ఎవరి పుట్టి ముంచుతాయనేది తేలాల్సి ఉంది. ఏతావాతా బెంగాల్ ఎన్నికలు టీఎంసీకి అగ్నిపరీక్షగా మారాయి. గత ఎన్నికల్లో గెలిచినా.. బీజేపీ మమతను టెన్షన్ పెట్టింది. ఈసారి కూడా కాషాయ పార్టీ హడావుడి ఎక్కువగానే ఉంది. దీంతో దీదీ కూడా దీటైన కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. మరోసారి బెంగాల్ కూతురు సెంటిమెంట్ ప్రయోగిస్తున్న మమత.. బలమైన సంస్థాగత పునాదులే కాపాడతాయనే నమ్మకంతో కనిపిస్తున్నారు.బెంగాల్ శాసనసభకు 294 స్థానాలకు గాను ఈ నెల 23, 29.. రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల ఫలితాలు మే 4న విడుదల కానున్నాయి. బెంగాల్‌లో గత 15 ఏళ్లుగా తృణమూల్ కాంగ్రెస్ పాలన కొనసాగుతోంది. 2011లో వామ పక్ష ప్రభుత్వ పాలన అంతరించిన తర్వాత మమతా బెనర్జీ బలమైన నాయకురాలిగా ఎదిగారు. బెంగాల్ రాజకీయాలను ఏకఛత్రాధిపత్యంగా శాసిస్తున్న దీదీకి తాజాగా పెను సవాల్ ఎదురవుతోంది. బెంగాల్‌లో ఇక తనకు ఎదురు లేదని మమతా బెనర్జీ భావిస్తున్న తరుణంలో.. అకస్మాత్తుగా బీజేపీ ఒక బలమైన రాజకీయ శక్తిగా మారింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా 18 సీట్లు గెలుచుకోవడం టీఎంసీకి షాక్ ఇచ్చింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బీజేపీ 77 సీట్లు సాధించి ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగింది. ఈసారి కూడా బీజేపీ, టీఎంసీ మధ్యే హోరాహోరీ పోరు జరిగేలా ఉంది.బెంగాల్ ఎన్నికల్లో గెలుపుకు మహిళా ఓటర్లు కీలకంగా మారారు. మమత ఓటర్లుగా ముద్రపడ్డ మహిళల్ని తనవైపుకి తిప్పుకోవటానికి బీజేపీ వారిపై వరాల జల్లు కురిపిస్తోంది. ప్రచారం ఉధృతంగా సాగుతున్న తరుణంలో, తృణమూల్ కాంగ్రెస్ లక్ష్మీర్ భండార్, బీజేపీ మాతృశక్తి వందన్ యోజన మధ్య పోటీ పరోక్షంగా ఊపందుకుంది. లక్ష్మీర్ భండార్ పథకం తృణమూల్‌కు ఎంతో కాలంగా అచ్చొచ్చిన పథకం. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పుంజుకున్న బీజేపీని అధిగమించడంలో ఈ స్కీమే టీఎంసీకి శ్రీరామరక్షగా నిలిచింది. అంతే కాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆ పార్టీ విజయానికి దోహదపడింది. సాధారణ వర్గాల మహిళలకు నెలకు రూ.1,500, షెడ్యూల్డ్ వర్గాల మహిళలకు రూ.1,700 అందించే ఈ పథకం లబ్ధిదారుల సంఖ్య 2.42 కోట్లకు చేరుకుంది. మమత మహిళా ఓటుబ్యాంక్‌ను కొల్లగొట్టాలనే ప్లాన్‌తో ఉన్న బీజేపీ.. తన మ్యానిఫెస్టోలో.. బెంగాల్‌లో ప్రతి మహిళకు నెలకు రూ.3 వేలు ఇస్తామని ప్రకటించింది. అలాగే గర్భిణిలకు రూ.21 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ దెబ్బతో లక్ష్మీర్ భండార్ పథకం పనిచేయదని కాషాయ పార్టీ లెక్కలేస్తోంది.ఢిల్లీ నుంచి గల్లీ దాకా అనే నినాదంలో భాగంగా.. ఈసారి బెంగాల్‌పై కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ అగ్రనాయకత్వం పకడ్బందీ ప్రణాళికతో ఉంది. గత ఎన్నికల్లో 77 స్థానాలు మాత్రమే గెలుచుకున్నప్పటికీ 39 శాతం ఓట్లు సాధించి విజయం అసాధ్యమేమీ కాదన్న ఆత్మవిశ్వాసం పోగుచేసుకుంది. అదే ఊపులో ఈసారి పంచముఖ వ్యూహంతో ఆ పార్టీ పథక రచన చేస్తోంది. రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా విభజించి, ఒక్కో జోన్‌కు కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల సీనియర్ నేతలను ఇన్‌ఛార్జులుగా నియమించారు. సమర్థులైన అభ్యర్థుల ఎంపికతోపాటు, అక్కడి సమాజిక, రాజకీయ పరిస్థితుల ఆధారంగా అధిష్టానం వ్యూహాలను క్షేత్రస్థాయిలో అమలు చేయడం వారి బాధ్యత. మోడీ ఛరిష్మా ఎలాగూ తమకు ప్రధానాస్త్రం కానుందని ఆ పార్టీ చెబుతోంది. టీఎంసీ 15 ఏళ్ల పాలనపై వ్యతిరేకత, సందేశ్‌ఖాలీ, ఆర్.జి.కర్ వంటి సున్నితమైన అంశాలను హైలైట్ చేస్తూ మహిళా ఓటర్లను ఆకట్టుకోవడం బీజేపీకి ప్రధానాస్త్రాలు. అలాగే సీఏఏ ద్వారా మథువా ఓట్లను కన్సాలిడేట్ చేయడం బీజేపీ ప్రధాన లక్ష్యం. దీనికి తోడు టీఎంసీ ఓటు బ్యాంకును చీల్చే వర్గాలను గుర్తించి వారితో పొత్తులు, లేదా విడిగా పోటీచేయించే ఎత్తులు కూడా బీజేపీ వేస్తోంది.జాతీయ వాద ఓటర్లను కూడగట్టడంలో బీజేపీ ముందుంటే ప్రాంతీయ వాదాన్ని అనుకూలంగా మార్చుకోవడంలో మమత సిద్ధహస్తురాలు. 'మా-మాటీ-మానుష్' వ్యూహంతో విపక్షాల దాడిని తిప్పికొట్టే ప్రయత్నంలో వుంది. బీజేపీని బయటి పార్టీగా ముద్ర వేయడం, బెంగాలీ సంస్కృతిని కాపాడేది తానేనని ప్రజల్లోకి వెళ్లడం మమత ప్రధాన ప్రచారాస్త్రం. లక్ష్మీర్ భండార్ ద్వారా మహిళలకు అందుతున్న ఆర్థిక సాయం, మైనారిటీల కోసం పెంచిన గౌరవ వేతనాలు వంటివి ఆమెకు బలమైన ఓటు బ్యాంకును సృష్టించాయి. షెడ్యూల్డ్ కులాలు, తెగలు, ఓబీసీ వర్గాల కోసం కొత్తగా ఐదు అభివృద్ధి బోర్డులను ఏర్పాటు చేసి సోషల్ ఇంజనీరింగ్‌కు తెరలేపారు దీదీ.ఏ పార్టీ వ్యూహం ఎలా ఉన్నా.. బెంగాల్‌లో దాదాపు 30 శాతం వరకు ఉన్న ముస్లిం ఓటర్లు ఎప్పుడూ టీఎంసీకి వెన్నెముకగా నిలుస్తున్నారు. సీఏఏ, ఎస్ఐఆర్ వంటి బీజేపీ విధానాలు ఈసారి కూడా మైనారిటీ ఓట్లు తమవైపే కన్సాలిడేట్ అవుతాయన్న నమ్మకంతో మమత ఉన్నారు. అసలు 33 శాతం మైనారిటీల్లో అత్యధికులు మమతకు ఓటు వేయటమే దీదీ వరుస విజయాలకు కారణం. కానీ ఈసారి సీన్ మారుతుందని బీజేపీ మొదట్లో అంచనా వేసింది. ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ మత పెద్దల మద్దతుతో యువతలో క్రేజ్ సంపాదించింది. దక్షిణ బెంగాల్‌లో టీఎంసీ ఓట్లను చీల్చే అవకాశం ఉంది.ూ×వీ×వీ (ఒవైసీ)గత ఎన్నికల్లో విఫలమైనా, ఈసారి మాల్దా, ముర్షిదాబాద్ వంటి జిల్లాల్లో గట్టిగా పోటీ చేసి తన ఉనికిని చాటాలని చూస్తోంది. టీఎంసీ మాజీ నేత కబీర్ పెట్టిన ఆమ్ జనతా ఉన్నయన్ పార్టీ(జీఖూ) మైనారిటీ అసంతృప్త ఓటర్లను ఆకర్షిస్తోంది. ఈ పార్టీలన్నీ కలిసి లెఫ్ట్-కాంగ్రెస్ కూటమితో జతకడితే, మైనారిటీ ఓట్లు భారీగా చీలిపోయి అల్టిమేట్‌గా బీజేపీకి మేలు జరుగుతుందనేది ఆ పార్టీ తొలి అంచనా. కానీ అనూహ్యంగా వెలుగుచూసిన కబీర్ స్టింగ్ ఆపరేషన్ వీడియోతో సమీకరణాలు మళ్లీ సంక్లిష్టంగా మారాయి. మైనార్టీ ఓట్ల చీలిక కోసం పనిచేయటానికి తనకు ఏకంగా పీఎంఓ నుంచే డబ్బు అందిందని కబీర్ చెబుతున్న ఆడియో వీడియోతో సహా లీకైంది. దీంతో టీఎంసీ వెంటనే ఎదురుదాడి మొదలుపెట్టింది. ఎంఐఎం కూడా అప్రమత్తమై కబీర్ పార్టీతో పొత్తు తెంచుకుంది. కానీ ఏం చేసినా..మైనార్టీలు ఈ వ్యవహారాన్ని ఎలా చూస్తారనేది ఎన్నికల్లో డిసైడింగ్ ఫ్యాక్టర్ అని చెప్పటానికి సందేహించాల్సిన పని లేదు.బెంగాల్‌లో మైనార్టీలతో పాటు మథువాలు కీలకంగా ఉన్నారు. విభజన సమయంలో, ఆ తర్వాత బంగ్లాదేశ్ శరణార్థులుగా బెంగాల్‌కు వలస వచ్చిన హిందూ దళితులు మథువా వర్గీయులు. పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మథువా ఓటు బ్యాంక్ ఎన్నికల ఫలితాలను తలకిందులు చేయగల అత్యంత శక్తివంతమైన అంశం. బెంగాల్ జనాభాలో సుమారు 17 నుంచి 20 శాతం వరకు ఈ సామాజిక వర్గానికి చెందినవారే. ఉత్తర 24 పరగణాలు, నదియా సరిహద్దు జిల్లాల్లో వీరికి భారీ పట్టు ఉంది. బెంగాల్‌లో సుమారు 30 నుంచి 40 అసెంబ్లీ స్థానాల్లో మథువా ఓటర్లు గెలుపోటములను శాసించగలరు. గతంలో వామపక్షాలకు, ఆ తర్వాత మమతా బెనర్జీకి మథువాలు అండగా నిలిచారు. కానీ 2019 లోక్‌సభ ఎన్నికల నుంచీ మథువాలు బీజేపీకి మొగ్గుచూపుతున్నారు. దశాబ్దాలుగా మథువాలు ఎదురుచూస్తున్న అంశం శాశ్వత పౌరసత్వం. జూూూ అమలును వేగవంతం చేయడం ద్వారా మథువాలకు పౌరసత్వం ఇస్తామని కేంద్రం హామీ ఇచ్చింది. ఈ ఆశతోనే తమకి జై కొడుతున్న మథువాలు.. మరోసారి మద్దతిస్తారని బీజేపీ అంచనా వేస్తోంది.గత ఎన్నికల్లో ఖాతా తెరవలేకపోయిన లెఫ్ట్ పార్టీలు ఈసారి చావోరేవో తేల్చుకోవాలని చూస్తున్నాయి. ముహమ్మద్ సలీం నాయకత్వంలో యువ అభ్యర్థులకు పెద్దపీట వేశారు. కాంగ్రెస్ పార్టీ కూడా తన పట్టున్న ఉత్తర బెంగాల్ జిల్లాలపై దృష్టి సారించింది. వీరు మైనారిటీ పార్టీలతో పొత్తు పెట్టుకుంటే టీఎంసీ గెలుపును పరోక్షంగా ఆపగలవు తప్ప స్వయంగా పూర్వ వైభవం దక్కించుకునే అవకాశం లేదు. చివరిగా బెంగాల్ ఎన్నికలు ఎప్పుడూ భావోద్వేగాల మీద నడుస్తాయి. ఓ వైపు హిందూ ఓట్లను ఏకం చేయాలని బీజేపీ, మరోవైపు మైనారిటీలు, మహిళల మద్దతుతో కోటను కాపాడుకోవాలని టీఎంసీ చూస్తున్నాయి. కానీ మైనారిటీ పార్టీలు, మథువాల వంటి సమాజిక వర్గాలు ఎన్ని ఓట్లు చీలుస్తాయనే దానిపైనే బెంగాల్ సింహాసనం ఎవరికి దక్కుతుందనేది ఆధారపడి ఉంటుంది. అంతిమంగా ప్రస్తుతం బెంగాల్లో ప్రతి ఓటూ కీలకమే. మెజార్టీ నియోజకవర్గాల్లో స్వల్ప మెజార్టీలే వస్తాయనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.పశ్చిమ బెంగాల్‌లో తొలి దశ ఎన్నికలకు సమయం దగ్గరపడ్డ తరుణంలో.. కీలక పరిణామం చోటుచేసుకుంది. ఓటరు జాబితాలో కేంద్ర ఎన్నికల సంఘం సుమారు 7 లక్షల మంది కొత్త ఓటర్లను చేర్చింది. అయితే ఈ అదనపు ఓటర్ల వయసు, వారు పురుష లేదా మహిళా ఓటర్లా అనే విషయాన్ని ఈసీ వెల్లడించలేదు. అలాగే ఓటర్ల జాబితాలో చేర్చడం కోసం అందిన ఫారం-6 దరఖాస్తుల సంఖ్యను గానీ, వాటిలో ఎన్ని తిరస్కరణకు గురయ్యాయో అనే విషయాన్నీ గోప్యంగా ఉంచుతోంది. ఎన్నికలకు కొద్ది రోజుల ముందే బెంగాల్ ఓటరు జాబితాల్లో లక్షలాది మందిని చేర్చడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటికే కేంద్ర ఎన్నికల సంఘంపై టిఎంసి, ఇతర ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. కొత్త ఓటర్లలో సుమారు 3.22 లక్షల మంది మొదటిదశ పోలింగ్‌లో ఓటు వేయనుండగా, మిగిలిన 3.88 లక్షల మంది ఓటర్లు రెండో దశ పోలింగ్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని ఎన్నికల సంఘం తెలిపింది. నిబంధనలకు అనుగుణంగా మొత్తం గణాంకాలను విడుదల చేశామని పేర్కొన్నారు. వివరణాత్మక సమాచారాన్ని తర్వాత విడుదల చేస్తామని ప్రకటించారు. ప్రస్తుతం రాష్ట్రంలో మొత్తం ఓటర్ల సంఖ్య 6.82 కోట్లుగా ఉంది.ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ సందర్భంగా పశ్చిమ బెంగాల్‌లో ఏకంగా 91 లక్షల మంది పేర్లను తొలగించారు. ఈ వ్యవహారంపై కొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అప్పీలేట్ ట్రిబ్యునళ్లలో సరైన ధ్రువీకరణ పత్రాలు చూపించినవారిని తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చాలని ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత ఎన్నికలకు ముందే జాబితాలో చేర్చి ఓటు హక్కు కల్పించాలని నిర్దేశించింది. అప్పీలేట్ ట్రిబ్యునళ్లలో దాదాపు 34 లక్షల మంది తమ ధ్రువపత్రాలను చూపించి ఓటర్లుగా నిరూపించుకున్నారు. వాస్తవానికి వీరందరినీ ఎన్నికల సంఘం తన జాబితాలో చేర్చాలి. అయితే ఆ 34 లక్షల మంది గురించి ఎన్నికల సంఘం ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రస్తుతం ఏడు లక్షల మంది చేర్చినా..వారు ఎవరు అనేది పూర్తి వివరాలు బయటకు చెప్పలేదు. ఓటర్ల జాబితాలో చోటుచేసుకున్న భారీ గందరగోళం రాజకీయ పార్టీలను టెన్షన్ పడుతోంది. ఏకంగా 64 లక్షల మంది పేర్లను జాబితా నుంచి తొలగించడం, మరో 60 లక్షల మందిని పరిశీలనలో ఉంచడమే దీనికి కారణం. ఎన్నికల సంఘం చేపట్టిన జాబితా సవరణ ప్రక్రియలో లక్షలాది మంది పౌరులు తమ ప్రాథమిక హక్కును కోల్పోయారు. స్పెల్లింగ్ తప్పులు, సాంకేతిక కారణాలతో ఏకంగా 64 లక్షల మందిని ఓటుకు దూరం కావడంతో ఈ సారి ఫలితంపై ప్రభావం చూపే అవకాశాలు కనిపిస్తున్నాయి. లక్షలాది ఓట్ల గల్లంతు -- గెలుపోటములపై భారీ ప్రభావం ఓటర్ల జాబితా సవరణ రాజకీయ పార్టీల లెక్కలను తారుమారు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఏకంగా సుమారు 11 శాతం ఓటర్ల పేర్లు తొలగించడం వెనుక సాంకేతిక కారణాలు, స్పెల్లింగ్ తప్పులు ఉన్నాయని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం రాజకీయ సెగ పుట్టిస్తోంది. ముఖ్యంగా ముర్షిదాబాద్, మాల్దా వంటి జిల్లాల్లో అత్యధికంగా పేర్లు తొలగింపుకు గురవటం.. ఆయా నియోజకవర్గాల్లోని అభ్యర్థులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. చాలా చోట్ల గత ఎన్నికల్లో గెలుపోటముల మార్జిన్ కంటే తొలగించిన ఓట్ల సంఖ్యే ఎక్కువగా ఉండటంతో, ఫలితం ఎటు తిరుగుతుందోనని ప్రధాన పార్టీలు ఆందోళన చెందుతున్నాయి.పోలింగ్‌కు కేవలం రెండు రోజుల ముందు విడుదలయ్యే అనుబంధ జాబితాల ద్వారా తమ పేరు మళ్లీ చేరుతుందని లక్షలాది మంది ఓటర్లు ఆశగా ఎదురుచూస్తున్నారు. రాజకీయ పార్టీలు సైతం తమ మద్దతుదారుల పేర్లు తిరిగి జాబితాలో ఉండేలా ట్రిబ్యునళ్ల చుట్టూ తిరుగుతున్నాయి. బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ప్రతి ఓటు అత్యంత కీలకం. ఇలాంటి పరిస్థితుల్లో లక్షలాది మంది ఓటర్లు జాబితా నుంచి దూరం కావడం ఎన్నికల పారదర్శకతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. తమ ఓటు హక్కు కోసం ప్రజలు ట్రిబ్యునళ్ల ముందు బారులు తీరడం, న్యాయపోరాటం చేయాల్సి రావడం ప్రస్తుత ఎన్నికల ప్రక్రియలోని సవాళ్లను సూచిస్తోంది. ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో జరగనున్న పోలింగ్‌లో ఈ ఓట్ల గల్లంతు ఎవరికి లాభిస్తుంది? ఎవరిని దెబ్బతీస్తుంది? అనేది ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ గందరగోళం మధ్య ఓటింగ్ శాతం తగ్గిపోతుందా లేక పౌరులు పట్టుదలతో తమ హక్కును సాధించుకుంటారా అనేది వేచి చూడాలి. ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియపై నమ్మకం కోల్పోతే అది ఓటింగ్ శాతంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఓటు వేయడానికి వెళ్ళినప్పుడు జాబితాలో పేరు లేకపోవడం కంటే ఒక పౌరుడికి పెద్ద అవమానం ఉండదు. ప్రజాస్వామ్యంలో ఓటరును ట్రిబ్యునళ్ల చుట్టూ తిప్పించడం మంచిది కాదని పార్టీలంటున్నాయి.పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమరంలో రాజకీయ వేడి తారాస్థాయికి చేరింది. తృణమూల్ కాంగ్రెస్ ప్రచారంలో కేంద్ర బిందువుగా మారిన యువ నేత, కీలక వ్యూహకర్త అభిషేక్ బెనర్జీ సరికొత్త రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నారు. పదునైన విమర్శలు, ప్రతిపక్షాలపై సూటి ప్రశ్నలు, క్షేత్రస్థాయిలో విస్తృత పర్యటనలతో ఆయన తన ప్రచార శైలికి మరింత పదునుపెట్టారు. ఒకవైపు ప్రతిపక్షాల వ్యూహాలను ఎండగడుతూనే, పార్టీ మూలాలను బలోపేతం చేసే దిశగా ఆయన వేస్తున్న అడుగులు బెంగాల్ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారాయి. మమత శిష్యరికంలో రాటుదేలిన అభిషేక్.. ఈసారి ఎన్నికల్లో దీదీకి అన్నివిధాలా అండగా నిలుస్తూ టీఎంసీ శ్రేణుల్లో ఉత్సాహం నింపుతున్నారు. బెంగాల్ ఎన్నికల ప్రచారం హోరెత్తుతున్న వేళ సిలిగురి కారిడార్ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రధానాంశంగా మారింది. దేశ భద్రత దృష్ట్యా దాన్ని కేంద్రపాలిత ప్రాంతం చేస్తారంటూ మొదలైన ప్రచారం రాజకీయంగా దుమారం రేపుతోంది. దేశ సమాఖ్య స్వరూపాన్ని దెబ్బతీసేందుకు, రాష్ట్రాల హక్కులను కాలరాసేందుకే మోడీ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు దిగుతోందని తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిప్పులు చెరుగుతున్నారు. ఈ అంశాన్ని ప్రధాన ప్రచారాస్త్రంగా మలచుకుంటున్నారు.బెంగాల్ ఎన్నికలను కాషాయ పార్టీ చాలా సీరియస్‌గా తీసుకుంది. అమిత్ షా ఏకంగా పదిహేను రోజుల పాటు బెంగాల్‌లోనే క్యాంప్ వేశారు. మోడీ కూడా ప్రచార సభలతో హోరెత్తిస్తున్నారు. చివరకు ప్రధాని స్థాయిలో ఉన్న మోడీ అనూహ్యంగా ప్రోటోకాల్ పక్కనపెట్టి.. రోడ్డు పక్కన దుకాణంలో ఝాల్ మురీ తినటం.. బెంగాలీలను ఆశ్చర్యపరిచింది. ఓవైపు మమతా పాలనపై విమర్శలు ఎక్కుపెడుతున్న మోడీ.. మరోవైపు బెంగాలీలతో కలిసిపోయే ప్రయత్నం చేస్తూ.. స్థానిక బీజేపీ నేతలకు ప్రజాదరణ లేకపోవటాన్ని కవర్ చేసే ప్రయత్నం గట్టిగా చేస్తున్నారు. బెంగాల్‌లో ముస్లిం ఓటు బ్యాంకే మమతను కాపాడుతోందని గుర్తించిన బీజేపీ.. ఈసారి అందుకు తగ్గట్టుగా వ్యూహరచన చేసింది. ముస్లిమేతరుల్ని వీలైనంత మేర కన్సాలిడేట్ చేసే అవకాశాలు చూస్తోంది. పశ్చిమ బెంగాల్ లో ముస్లింల జనాభా 27 అయినప్పటికీ.. 3 జిల్లాల్లోనే వారు మెజారిటీ సంఖ్యలో ఉన్నారు. అవి ముర్షిదాబాద్, మాల్దా, ఉత్తర దినాజ్ పూర్. వీటిలో ముర్షిదాబాద్ లో ముస్లింల జనాభా 66శాతంగా ఉంది. ఇక మాల్దా జిల్లాలో 51శాతం, ఉత్తర దినాజ్ పూర్ జిల్లాలో 50శాతంగా ఉంది. మిగతా 20 జిల్లాల్లో.. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే.. రాష్ట్రంలోని మొత్తం 294 అసెంబ్లీ నియోజకవర్గాలకు గానూ, 251 అసెంబ్లీ సీట్లలో.. స్పష్టంగా హిందువుల మెజారిటీ ఉంది. అంటే, రాష్ట్ర స్థాయిలో ముస్లింల జనాభా 27శాతం ఉన్నప్పటికీ.. భౌగోళికంగా అది కొన్ని బెల్ట్‌లలోనే కేంద్రీకృతమై ఉంది.బెంగాల్ ఎన్నికల సందర్భంగా మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు జాతీయస్థాయిలో సంచలనం సృష్టించాయి. ఈసారి బెంగాల్ గెలిస్తే.. తర్వాత ఢిల్లీపై ఫోకస్ పెడతామని దీదీ హెచ్చరించారు. దీంతో మమతను బెంగాల్‌లోనే నిలువరించాలని బీజేపీ సర్వశక్తులు ఒడ్డుతోంది. కానీ ఆ పార్టీ పప్పులు బెంగాల్లో ఉడికేది లేదని, తమ నేత భవిష్యత్తులో ప్రధాని అవుతారని టీఎంసీ శ్రేణులు తొడ కొడుతున్నాయి. బెంగాల్లో అధికారం ఖాయమని ధీమాగా ఉన్న టీఎంసీ.. లోలోపల బీజేపీ ఏం చేస్తుందోనని భయపడుతోంది. ఇక ఈసారి పవర్లోకి వచ్చేస్తామని ఊదరగొడుతున్న బీజేపీ కూడా.. లోపాయికారీగా మమత బలాలు చూసి కలవరపడుతోంది. ఇక్కడ ప్రధాన ప్రత్యర్థులతో పాటు మిగతా పక్షాలు ఎవరి ఓట్లు చీల్చుతాయి.. ఎవరి పుట్టి ముంచుతాయనేవి కీలక ప్రశ్నలుగా మిగిలాయి. బెంగాల్‌లో ప్రధాన పోటీ టీఎంసీ, బీజేపీ మధ్యే ఉన్నా.. కాంగ్రెస్ ఒంటరి పోరు ఎవరి పుట్టి ముంచుతుందనేది తేలాల్సి ఉంది. అలాగే ఎంఐఎం వ్యూహాలు కూడా ఆసక్తి రేపుతున్నాయి.మొత్తం మీద బెంగాల్ ఎన్నికలు మమతకు, బీజేపీకి పరువు, ప్రతిష్ఠకు సవాల్‌గా మారాయి. ఈ రెండు పార్టీల వ్యూహప్రతివ్యూహాలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెంచుతున్నాయి. అందరూ అనుకున్నట్టుగా ఓ పార్టీకి సవాల్‌గా మారిన అంశమే.. మరో పార్టీని కూడా ఎంతోకొంత దెబ్బ కొడుతోంది. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. అభ్యర్థుల ఎంపికలో అసంతృప్తి, ఎస్ఐఆర్ ద్వారా ఓట్ల జాబితాలో జరిగిన భారీ మార్పులు.. అధికార టీఎంసీతో పాటు విపక్ష బీజేపీకీ సవాలుగా మారాయి. ఈ పరిణామాలు బెంగాల్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేయనుందన్న ప్రచారం నెలకొంది. ఈసారి ఏకంగా 74 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టీఎంసీ ఈసారి టికెట్ నిరాకరించింది. బీజేపీ, సీపీఎంలలోను అదే పరిస్థితి. కొత్త అభ్యర్థుల పట్ల అసంతృప్తితో ఉన్న కార్యకర్తలు.. పోలింగ్ బూత్ స్థాయిలో సహకరించకపోతే పరిస్థితి ఏంటన్న ఆందోళన ఆయా పార్టీల్లో వ్యక్తమవుతోంది.తృణమూల్ కాంగ్రెస్ చీఫ్ మమతా బెనర్జీ 2011 నుంచి పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. 1977 నుంచి ఏకధాటిగా పశ్చిమ బెంగాల్‌ను పాలిస్తున్న వామపక్ష ప్రభుత్వాన్ని మమతా బెనర్జీ అనూహ్యంగా ఓడించారు. మమతా బెనర్జీ కాంగ్రెస్ పార్టీని కూడా వెస్ట్ బెంగాల్‌లో పూర్తిగా నాశనం చేసింది. 2021లో జరిగిన పశ్చిమ బెంగాల్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో కమ్యూనిస్ట్ పార్టీలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు గెలవకుండా మమతా బెనర్జీ అడ్డుకోగలిగారు. ఆమెకు ఎదురు నిలిచిన రాజకీయ శత్రువులు మొత్తం కనుమరుగై పోయారని మమతా బెనర్జీ భావిస్తున్న తరుణంలో.. అకస్మాత్తుగా బీజేపీ పశ్చిమ బెంగాల్‌లో ప్రధాన ప్రతిపక్షంగా మారింది. ఈ హఠాత్ పరిణామానికి మొదట్లో కాస్త తడబడ్డ మమత.. తర్వాత బాగానే తేరుకున్నారు. తన పోరాటపటిమను కొత్త శత్రువుకి కూడా గట్టిగానే చూపించారు. కాకపోతే మునుపటి ఎన్నికల కంటే గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం చెమటోడ్చాల్సి వచ్చిన మాటను టీఎంసీ కూడా కాదనలేదు. కానీ ఏ మాటకు ఆ మాటే. మమతా బెనర్జీ బెంగాల్ రాజకీయంలో తల పండిపోయారు. ఆమెను ఓడించడం అంత తేలిక కాదని బీజేపీకీ తెలుసు. మమతా బెనర్జీకి రాజకీయాల్లో ఫైటర్ గా గుర్తింపు ఉంది. ఆమె కాంగ్రెస్ లో ఉన్నప్పట్నుంచీ.. సీఎం అయ్యాక కూడా ఎప్పుడూ పోరాట పంథాను వీడలేదు. యూత్ కాంగ్రెస్ నేతగా ఎలా ఉన్నారో.. బెంగాల్ సీఎంగా కూడా అలాగే ఉండటం మమత ప్రత్యేకత. ఎప్పటికప్పుడు ప్రజలకు దగ్గరగా ఉన్నాననే ఫీలింగ్ కలిగించడంలో దీదీ విజయవంతమౌతున్నారు. అయితే మమత పాలనపై చాలా విమర్శలు కూడా ఉన్నాయి.మమత అతి దూకుడే.. ఆమెకు ఒక్కోసారి కష్టాలు తెచ్చిపెడుతుంది. స్థానికంగా ఉన్న ప్రత్యర్థుల్ని అణగదొక్కడం ఎప్పటికైనా ముప్పేనని మమత గ్రహించలేకపోయారు. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడు సీట్లు గెలిచినప్పుడు కూడా.. దీదీ కాషాయ పార్టీని సీరియస్ గా తీసుకోలేదు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు నడిపినవాళ్లకే దిక్కు లేదు.. బీజేపీ ఏం చేస్తుందని ధీమాగా ఉన్నారు. కానీ 2019 పార్లమెంట్ ఎన్నికల ఫలితాలతో మమతకు తలబొప్పి కొట్టింది. స్థానిక ప్రత్యర్థుల్ని బలహీనపరిచిన కారణంగా ఏర్పడిన రాజకీయ శూన్యతను బీజేపీ భర్తీ చేసిందని ఆలస్యంగా అర్థమైంది. తృణమూల్ ఆగడాలతో బెదిరిపోయిన లెఫ్ట్ కార్యకర్తలు బీజేపీ వైపు ఆకర్షితులయ్యారు. టీఎంసీ కార్యకర్తల దాడికి కనీస ప్రతిఘటన ఇవ్వాలన్నా.. కాషాయ జెండా నీడ తప్పదని గ్రహించారు. దీంతో బీజేపీకి క్షేత్రస్థాయిలో క్యాడర్ బలం బాగా పెరిగింది. ఆ బలంతోనే 2021 ఎన్నికల్లో మమతకు ముచ్చెమటలు పట్టేలా చేసింది కాషాయ పార్టీ. ఇప్పుడు ఏకంగా గెలిచేస్తామని సవాల్ విసురుతోంది.అధికారం కోసం తృణమూల్, బీజేపీ హోరాహోరీగా తలపడుతున్న తరుణంలో.. బెంగాల్ లో కీలకమైన మైనార్టీలు ఎటువైపు మొగ్గుచూపుతారు, వీరి ఓట్ల చీలిక ఎవరికి లాభిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఇక రోహిగ్యాలది వేరే కథ. కేవలం తమ పార్టీ ఓటుబ్యాంకు కోసమే మమత వీరి అక్రమ వలసల్ని ప్రోత్సహిస్తుందనేది బీజేపీ ప్రధాన ఆరోపణ. ఇటీవలే జరిగిన సర్‌లో ఏకంగా 58 లక్షల ఓట్లు తొలగించారు. వీటిలో మెజార్టీ టీఎంసీ ఓట్లేనని బీజేపీ ఇప్పటికే ప్రచారం చేస్తోంది. వీరంతా చొరబాటుదారులని, ఓటు బ్యాంక్ కోసం దీదీ దేశవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారని సాక్షాత్తు కేంద్ర హోం మంత్రి అమిత్ షా విరుచుకుపడుతున్నారు. తద్వారా ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న యాంటీ బంగ్లాదేశ్ సెంటిమెంట్‌ను వాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. 2011 నుంచి మమతా బెనర్జీ వరుసగా మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. 2024లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో 42 పార్లమెంటు నియోజకవర్గాల్లో 29 మంది ఎంపీలని మమతా బెనర్జీ గెలిపించారు. ఈ ట్రెండ్ ప్రకారం 2026 అసెంబ్లీ ఎన్నికల్లో మమతా బెనర్జీ గెలవాలి. మమతకు ఉన్న ప్రధాన అడ్వాంటేజ్ ఆమెకు ఓటు వేసే 28 శాతం మంది ముస్లిం ఓటర్లు. మరోవైపు బీజేపీ కూడా వేగంగా పుంజుకుంటోంది. కానీ మమతా బెనర్జీపై ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ఆ పార్టీ ఎంతవరకు క్యాష్ చేసుకోగలదనేది కీలకం. బెంగాల్ ఎన్నికల్లో ఎవరు గెలిచినా.. దేశ రాజకీయాలపై ప్రభావం చూపటం ఖాయం అని చెప్పటంలో మరో మాటకు తావు లేదు.ఖ

సంపాదకీయం పేజీలో రచనలు పంపవలసిన వాట్సప్ నంబర్ ,మెయిల్ ఐడి
9951512539
flashindia999@gmail.com

# మళ్లీ జనంలోకి గులాబీ బాస్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రణాళికలు రచిస్తున్నారు. ఇక నుంచి ప్రజల్లో ఉండాలని ఆయన నిర్ణయించుకున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. జగిత్యాల సభతో ప్రజల్లోకి వచ్చిన కేసీఆర్.. ఇక నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ బహిరంగ సభలు నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది. జగిత్యాల సభతో వచ్చిన మైలేజీతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలుసుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్టు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేండ్లు పూర్తవుతున్నందునా.. ప్రభుత్వానికి సరిపడా సమయం ఇచ్చామని.. ఇక ఊరుకునేది లేదంటూ ప్రజాక్షేత్రంలో తేల్చుకునేందుకు పార్టీని సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

**27న హైదరాబాద్ కీలక సమావేశం**

పార్టీ బలోపేతం, భవిష్యత్ వ్యూహాలపై దృష్టి సారిస్తూ ఈ నెల 27న మధ్యాహ్నం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ముఖ్య సమావేశాన్ని కేసీఆర్ నిర్వహిస్తున్నారు. అదే రోజు పార్టీ ఆవిర్భావ దినోత్సవం కావడం.. రజతోత్సవ వేడుకలు ముగింపు కార్యక్రమాన్ని సైతం నిర్వహించనున్నారు. పార్టీ రజతోత్సవ సంబురాల ముగింపును పురస్కరించుకుని కేసీఆర్ అధ్యక్షతన ఈ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు తెలంగాణ భవన్‌లో ఈ భేటీ జరగనుంది. ఈ సమావేశానికి పార్టీకి చెందిన ముఖ్య నేతలందరినీ ఆహ్వానించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పనిసరిగా హాజరుకావాలని పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్లను సైతం ఈ భేటీకి ఆహ్వానించినట్టు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు.

**పార్టీ బలోపేతంపైనే దృష్టి..**

పార్టీ సంస్థాగత బలోపేతంపై కేసీఆర్ ప్రధానంగా దృష్టి సారించారు. అందులో భాగంగానే 27న నిర్వహిస్తున్న ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నది. ముఖ్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వాల పునరుద్ధరణ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ కేడర్‌ను ఎలా ముందుకు తీసుకెళ్లాలి, సభ్యత్వ నమోదు ప్రక్రియను ఏ విధంగా వేగవంతం చేయాలి అనే విషయాలపై దిశానిర్దేశం చేయనున్నారు. వీటితోపాటు ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపైనా స్పష్టత రానుంది. జిల్లా, మండల స్థాయిలోనూ పార్టీ నిర్మాణాన్ని పునర్వ్యవస్థీకరించడం, నాయకత్వాన్ని చురుకుగా మార్చడం వంటి అంశాలు ఎజెండాలో ఉండనున్నాయి. కొత్త సభ్యులను ఆకర్షించడం, యువతను పార్టీలోకి తీసుకురావడం, గ్రామస్థాయి వరకు పార్టీ విస్తరణ జరగాలనే లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించే దిశగా కేసీఆర్ పలు సూచనలు ఇస్తారని తెలిసింది. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని టాక్. ప్రతిపక్షాలపై దూకుడు పెంచడం, ప్రజా సమస్యలపై మరింతగా స్పందించడం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు రానున్నాయి.

**రాష్ట్రవ్యాప్తంగా బహిరంగ సభలు**

అదే సమయంలో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యకలాపాలను మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. అందులో భాగంగానే అన్ని జిల్లాల్లో బహిరంగ సభలు నిర్వహించాలని ప్రణాళికలు చేస్తున్నట్టు తెలిసింది.

ఈ సభల ద్వారా పార్టీ శక్తిని ప్రదర్శించడంతో పాటు ప్రజలతో నేరుగా మమేకం కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ బహిరంగ సభలు పార్టీకి మళ్లీ ఉత్సాహాన్ని నింపే అవకాశమున్నదని నేతలు భావిస్తున్నారు. మరీ ముఖ్యంగా వచ్చే నెల మొదటి వారంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో బహిరంగ సభను నిర్వహించాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలిసింది.

# తెలంగాణలో విద్యా విప్లవం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** మారుతున్న కాలానికి తగినట్లు మారితేనే మనుగడ సాధ్యమవుతుంది.. ఈక్రమంలోనే విద్యా రంగంలోనూ పలు సంస్కరణలకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పిల్లలంతా బడుల్లో ఉండడమే కాదు పెద్దలు సైతం అక్షరాలు నేర్చుకోవాలని... ఆధునిక కాలపు అవసరాలకు తగినట్లు తమను తాము మల్చుకోవాలనేది రాష్ట్ర ప్రభుత్వం యోచన. అందుకే వయోజన అక్షరాస్యత పెంపునపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనపర్చుతోంది. అదే సమయంలో పాఠశాల విద్యా రంగంపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.

**100 శాతం అక్షరాస్యత... వయోజన విద్యకు ప్రాధాన్యం**

సంపూర్ణ అక్షరాస్య రాష్ట్రంగా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుంది. 45 ఏళ్లు పైబడిన వయసులో అక్షరాస్యత తక్కువగా ఉండటాన్ని ప్రభుత్వం గుర్తించింది. దీంతో చాలా కాలంగా నిర్లక్ష్యానికి గురైన వయోజనుల విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఎక్కడికక్కడ వయోజన విద్య తరగతులు నిర్వహించారు. దీంతో 2025--26 సంవత్సరంలో 6.31 లక్షల మంది పెద్దలు అక్షరాస్యత పరీక్షలకు హాజరయ్యారు. గత ప్రభుత్వం హయాంలో, ముఖ్యంగా 2019 నుంచి 2024 వరకు వయోజన విద్య పెంపు అంశాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. దీంతో ఆ సమయంలో వయోజన విద్య పూర్తిగా కుంటుపడింది. అందుకు విరుద్ధంగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వయోజన విద్యపై ప్రత్యేక దృష్టి సారించింది. ఫలితంగానే వయోజన విద్యలో పెద్ద ఎత్తున పెరుగుదల నమోదైంది.

**పాఠశాలల్లో కొత్త మార్పులు**

తెలంగాణలోని పాఠశాలల్లో విద్యలో నాణ్యత పెంచేందుకు ప్రజా ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చింది. అకడమిక్ ప్యానెల్ ఇన్స్పెక్షన్ టీమ్స్ ద్వారా పాఠశాలల్లో బోధన విధానాలను ఉన్నతీకరించింది. ఇది విద్యార్థులకు అత్యాధునిక పద్ధతులలో అభ్యసనలో మెలుకువలు నేర్పించేందుకు ఉపయోగపడింది. ముఖ్యంగా పెద్దపల్లి జిల్లాలో 61 పాఠశాలల్లో ఈ విధానం అమలు చేసి, బోధనలో ఉన్న ఇబ్బందులు, అనుకూలతలను గుర్తించారు. చాలామంది ఉపాధ్యాయులకు మంచి పరిజ్ఞానం ఉన్నప్పటికీ, తరగతుల్లో విద్యార్థుల భాగస్వామ్యం తక్కువగా ఉండడాన్ని ఈ టీమ్స్ గుర్తించాయి. దానిని సరిదిద్ది సమర్థంగా అమలు చేయడంతో మంచి ఫలితాలు తీసుకురావడం సాధ్యమైందని విద్యా శాఖ అధికారులు భావిస్తున్నారు.

**ఆరు నెలల్లోనే మంచి ఫలితాలు**

ప్రజా ప్రభుత్వ చర్యల ఫలితంగా తక్కువ సమయంలోనే పాఠశాల విద్యలో మంచి మార్పులు చోటుచేసుకున్నాయి. బోధన పద్ధతుల్లో వ్యూహాత్మకత 48% నుంచి 68%కు పెరిగింది. తరగతుల గదుల మెరుగైన నిర్వహణలో 42% నుంచి 65%కు, బోధనాభ్యసన సామగ్రి, వనరుల వినియోగం 35% నుంచి 58%కు పెరిగింది. ఇవన్నీ మంచి ఫలితాలు వచ్చేందుకు కారణమయ్యాయి.

**ప్రాథమిక విద్యపై ప్రత్యేక దృష్టి**

పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ప్రాథమిక దశలోనే అక్షరాలు రాయడం, అంకెలు నేర్చుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ పై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2022-23 విద్యా సంవత్సరం నుంచి 2025-26 వరకు మంచి ఫలితాలు వచ్చాయి. తెలుగులో 9 శాతం నుంచి 35% శాతం వరకు... ఇంగ్లీష్ లో 4 శాతం, 29% శాతం... ఉర్దూ లో 19 శాతం నుంచి 40% శాతం వరకు అభ్యసన సామర్థ్యాలు పెరిగాయి. భాషతో పాటు అంకెలు నేర్చుకోవడం.. కూడికలు, తీసివేతలు వంటి గణిత ప్రక్రియల్లోనూ 18 శాతం నుంచి 30 శాతం ఫలితాలు అధికంగా వచ్చాయి.

**విద్యకు అత్యధిక నిధుల వినియోగం**

సమగ్ర శిక్షా పథకం కింద వచ్చిన నిధులను వినియోగించడంలో తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. 2025--26లో 84% నిధులు వినియోగించుకొని రాష్ట్రం దేశంలో మొదటి స్థానంలో ఉంది. ప్రతి రూపాయి విద్య కోసం, విద్యార్థుల కోసం వ్యయం చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. విద్యా రంగంలో ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు తెలంగాణను దేశంలో ముందువరుసకి తీసుకెళుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంస్కరణలు విద్యార్థులు, ఉపాధ్యాయులకు విద్యా వ్యవస్థ ప్రగతికి మరింత దోహదపడుతున్నాయి. విద్యా రంగంలో తెలంగాణ ఆదర్శ రాష్ట్రంగా ముందుకు సాగుతోంది.

# సివిల్ సప్లయిస్‌లో 'లక్ష'ణమైన దందా..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సివిల్ సప్లయీస్ కమిషనరేట్‌లో బాసులుగా ఐఏఎస్/ఐపీఎస్‌లు ఉన్నా పెత్తనం మాత్రం జనరల్ మేనేజర్లదే అని ప్రచారం జరుగుతున్నది. వారి కనుసన్నల్లోనే పలు కీలకమైన నిర్ణయాలు తీసుకుంటున్నట్టు విమర్శలు వస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో కమిషనర్లను సైతం తప్పుదారి పట్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జనరల్ మేనేజర్లను ఎక్కువ కాలం అదే పోస్టులో కొనసాగించడం వల్లే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ మధ్య అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్‌ను కొనసాగించేందుకు పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే పీడీఎస్ బియ్యం సరఫరా కాంట్రాక్టుల్లో ముడుపులు తీసుకుని తమకు అనుకూలమైన వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చే ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తున్నది.

**పైసలు ఇస్తేనే కొనసాగింపు..**

సివిల్ సప్లయీస్ శాఖలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చాలా కీలకమైన విభాగం. ప్రజలకు అందిస్తున్న రేషన్ బియ్యం నాణ్యతగా ఉన్నాయా? లేదా? పరిశీలించి సదరు టీమ్ క్లీన్‌చిట్ ఇచ్చిన తర్వాతే బియ్యం రేషన్ దుకాణాలకు వెళ్తాయి. అలాగే రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌లోకి తరలకుండా ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తుంటారు. ఇంతటి కీలకమైన బాధ్యతల్లో ఉన్న టెక్నికల్ టీమ్ ఫిజికల్‌గా యాక్టివ్‌గా ఉండాలి. కానీ ఈ వింగ్‌లో పనిచేస్తున్న మెజార్టీ మంది అవుట్ సోర్సింగ్ పద్ధతిలో రిటైర్డ్ అయిన ఉద్యోగులు ఉన్నారు. హెడ్ ఆఫీసులో ఉన్న సంబంధాల కారణంగా 70 ఏళ్లు నిండిన రిటైర్డ్ ఉద్యోగులను సైతం కొనసాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రతిఏడాది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను కొనసాగించాలంటే ఆర్థిక శాఖ నుంచి అనుమతి తప్పనిసరి. దీనితో సుమారు 70 మంది రిటైర్డ్ ఉద్యోగులను అవుట్ సోర్సింగ్ పద్ధతిన కొనసాగించాలంటే ఒక్కొక్కరు రూ.లక్ష ఇవ్వాలని కండీషన్ పెట్టినట్లు ప్రచారం జరుగుతున్నది. డబ్బులు ఇచ్చిన వారి పేర్లు మాత్రమే లిస్టులో చేర్చి ఆర్థికశాఖ అనుమతి కోసం పంపేందుకు జాబితాను రెడీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.

**ఆలస్యంగా గుర్తింపు..**

గోదాముల నుంచి బియ్యాన్ని రేషన్ డీలర్లకు సరఫరా చేసేందుకు ప్రతి ఏటా టెండర్లను పిలుస్తుంటారు. కొన్నేళ్లుగా ఆ విభాగం బాధ్యతలు చూస్తున్న అధికారులు తమకు తాయిళాలు, ప్రయోజనాలు అందించే ఏజెన్సీలకు కాంట్రాక్టులు అప్పగించేందుకు ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. అందుకోసం చిన్న చిన్న టెక్నికల్ కారణాలను సాకుగా చూపించి పోటీ ఏజెన్సీల బిడ్స్‌ను డిస్ క్వాలిపై చేయించినట్లు తెలిసింది. దీంతో 24 జిల్లాల్లో సింగిల్ ఏజెన్సీల టెక్నికల్ బిడ్స్ మాత్రమే క్లియర్ అయ్యాయి. టెక్నికల్ బిడ్స్‌లో కేవలం ఒక్కరే మిగిలితే తిరిగి టెండర్లు పిలవాలి. కానీ, హెడ్ ఆఫీసులోని కీలక అధికారులు సదరు ఏజెన్సీలకు కాంట్రాక్టు పనులు అప్పగించే ప్రయత్నాలను వేగవంతం చేశారు. ఈ విషయం కమిషనర్ దృష్టికి రావడంతో టెండర్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేసినట్లు తెలిసింది.

# జూన్ 8 వరకు గడువు..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇవాళ సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన ఇన్ఫ్రా స్ట్రక్చర్ అండ్ క్యాపిటల్ వర్క్స్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు, క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులైన శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడు సంవత్సరాల క్రితం బ్రిడ్జిలు నిర్మించినప్పటికీ వాటికి అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడం మూలంగా అవి నిరుపయోగంగా ఉన్నాయని వీటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి అవసరమైన రూ.148 కోట్ల నిధుల విడుదలకు క్యాబినెట్ సబ్ కమిటీ ఆమోదం తెలిపిందని డిప్యూటీ సీఎం ఈ సందర్భంగా ప్రకటించారు. సరైన పద్ధతిలో ప్రతిపాదనలు పంపితే ఆమోదం తెలపడం, అమలు చేయడం సులభం అవుతుందని పనులు వేగవంతం అవుతాయని డిప్యూటీ సీఎం అన్నారు. 1:4 నిష్పత్తిలో వివిధ శాఖల నుంచి ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపితే సబ్ కమిటీలు చర్చించి ఆమోదం తెలుపుతామని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు.

**జూన్ 8 లోపు నిర్మాణాలు పూర్తి:**

రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని జూన్ 8 లోపల అప్రోచ్ రోడ్ల నిర్మాణం పూర్తి కావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రగతిని తాను ప్రత్యేకంగా ప్రతి వారం సమీక్షిస్తానని మంత్రి స్పష్టం చేశారు. టెండర్లు పిలవడం, పనులు చేపట్టడం, నాణ్యతతో పనులు పూర్తి చేయడం వంటి అన్ని అంశాలను తాను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తానని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## కాళేశ్వరం పై సీబీఐ విచారణ జరపాలి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం లో జరిగిన అవినీతి, గత ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగంపై సీబీఐ విచారణ జరిపించాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక కంటే ముందే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఈ ప్రాజెక్టులో అనేక అవకతవకలు జరిగినట్లు స్పష్టం చేసిందని ఆయన గుర్తుచేశారు. సరైన భద్రతా ప్రమాణాలు పాటించకుండా ప్రాజెక్టును నిర్మించిన అధికారులపై ఇప్పటికే చర్యలు తీసుకున్నారని, కాళేశ్వరం విషయంలో తెలంగాణ ప్రజలకు పూర్తి నిజానిజాలు తెలియాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో బీజేపీ నాయకులపై బాధ్యత మరింత పెరిగిందని ఎంపీ చామల వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు చొరవ తీసుకుని ఈ కుంభకోణంపై సీబీఐ విచారణ ను వేగవంతం చేయాలని ఆయన కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన తుది తీర్పు వెలువడినప్పుడు అన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన దోపిడీ పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించి బాధ్యులను శిక్షించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

# మాజీ సీఎం కన్నుమూత..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు(90) కన్నుమూశారు. బుధవారం (ఏప్రిల్ 22, 2026) ఉదయం పరమపదించారు. వయో సంబంధిత సమస్యలతో హైదరాబాద్‌లోని కాంటినెంటల్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. కుటుంబ సభ్యులు, బంధువులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అభిమానులు అంతిమ నివాళులు అర్పించుకోవడానికి వీలుగా, ఆయన పార్థివ దేహాన్ని జూబ్లీహిల్స్ లోని స్వగృహంలో ఉంచనున్నారు. హైదరాబాద్ లోని పంజాగుట్ట, హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు నాదెండ్ల భాస్కర రావు కుటుంబీకులు తెలిపారు. ఆయన ఆకాంక్ష మేరకు గురువారం (ఏప్రిల్ 23, 2026) మధ్యాహ్నం 4 గంటలకు పంజాగుట్ట, హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. నాదెండ్ల భాస్కరరావు జూన్ 23, 1935న గుంటూరు జిల్లాలో జన్మించారు. వృత్తిరీత్యా లాయర్. కాంగ్రెస్ పార్టీతో రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. భాస్కరరావు 1978లో విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. చెన్నారెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మంత్రిగా పనిచేశారు. 1982లో ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ ఏర్పాటు సమయంలో టీడీపీలో చేరారు. 1983లో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగా.. ఎన్టీఆర్ కేబినెట్‌లోనాదెండ్ల భాస్కరరావు ఆర్థిక మంత్రిగా పనిచేశారు. 1984లో ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చికిత్స కోసం అమెరికా వెళ్ళిన సమయంలో రాజకీయ పరిస్థితులు మారిపోయాయి. అప్పుడు నాదెండ్ల భాస్కరరావు కొంతమంది ఎమ్మెల్యేల మద్దతుతో ముఖ్యమంత్రి అయ్యారు. దాదాపు నెలపాటూ సీఎంగా కొనసాగారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో నాదెండ్ల భాస్కరావు సీఎం పదవికి రాజీనామా చేశారు. అనంతరం మరోసారి కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. 1989 ఎన్నికల్లో తెనాలి నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేసి ఎమ్మెల్యేగా గెలిచారు.. 1994 ఎన్నికల్లో ఓడిపోయారు. 1998లో ఆయన ఖమ్మం ఎంపీగా పోటీచేసి విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

# బేఫికర్‌గా బెల్ట్ దందా..!



**గుండాల,ఫ్లాష్ ఇండియా :** గుండాల మండలంలోని బెల్ట్ షాపుల దందా అదుపు లేకుండా పడగ విప్పుతూ పల్లెల్లో మద్యం చిచ్చు పెడుతోంది. ప్రభుత్వ నిబంధనలను బేకాతరు చేస్తూ మద్యం సిండికేట్లు యథేచ్ఛగా అనధికారిక అడ్డాలను నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో ఉండి ఈ అక్రమాలను చూసీ చూడనట్లు వదిలేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లోని కిరాణా షాపులే ఇప్పుడు ప్రధాన మద్యం కేంద్రాలుగా మారి ఇంటి ముంగిటకే బాటిళ్లు సులభంగా అందుబాటులోకి రావడంతో యువత పెడదారి పట్టి భవిష్యత్తును అంధకారంలోకి నెట్టుకుంటోంది. ఈ అక్రమ దందాతో గ్రామాల్లో శాంతిభద్రతలు క్షీణించి సామాన్య కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బెల్ట్ షాపుల నడ్డి విరిచి పల్లెల్లో ప్రశాంతతను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయిస్తుండటంతో మద్యం ప్రియులు ఇష్టమొచ్చినట్లుగా తాగుతూ తమ జీవితాలను నాశనం చేసుకుంటూ కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. 'ఎనీ టైమ్ (ఏటీఎం)' అన్నట్లుగా ఉదయం, సాయంత్రం అనే తేడా లేకుండా 24 గంటలూ మందు అమ్మకాలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల అయితే ఇక్కడ మద్యం అమ్మబడును అని రాతపూర్వకంగా కాకుండా ఇంటి ముందు చెట్లకు ఖాళీ మద్యం సీసాలను కట్టి ప్రదర్శిస్తున్నారు. ఇది మద్యం ప్రియులకు సంకేతంగా మారింది. గ్రామాల్లో 5 నుంచి 6 బెల్ట్ షాపులు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండానే అనధికారికంగా నడుస్తున్నాయి. ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువగా తమ ఇష్టానుసారం ధరలు పెట్టి మద్యం విక్రయిస్తూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. బెల్ట్ షాపులు హోటళ్లు, బార్లను తలపిస్తూ రాత్రి పగలు అనే తేడా లేకుండా మద్యం విక్రయిస్తున్నాయి. వీటి కారణంగా మద్యం బానిసత్వం పెరిగి కుటుంబ కలహాలు అధికమవుతున్నాయి. మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి ప్రాణాలు తీసుకున్న ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. తన సొంత సోదరుడినే హత్య చేసిన సంఘటన కూడా వెలుగులోకి వచ్చింది. అయినా అధికారులు మాత్రం ఈ అనధికారిక మద్యం షాపుల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. తూతూ మంత్రంగా సోదాలు నిర్వహిస్తున్నారని, సోదాలకు వచ్చిన అధికారులకు అప్పుడప్పుడు ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో నిజం ఎంతుందో తెలియదు కానీ ఇదే అవకాశంగా భావించి వ్యాపారులు స్వేచ్ఛగా బెల్ట్ దందాను కొనసాగిస్తున్నారు. ఏదేమైనా సంబంధిత అధికారులు ఇప్పటికైనా కళ్లుతెరిచి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి. అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకొని మద్యం మహమ్మారి నుంచి కుటుంబాలను రక్షించాలి.

# ఈ ఇన్నింగ్స్ ఆమెకు అంకితం!




ఐపీఎల్ 2026లో భాగంగా మంగళవారం ఉప్పల్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓపెనర్ అభిషేక్ శర్మ రెచ్చిపోయాడు. 68 బంతుల్లో 10 ఫోర్లు, 10 సిక్సులతో 135 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. మెరుపు ఇన్నింగ్స్ ఆడిన అభిషేక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. అవార్డు తీసుకున్న అనంతరం అభిషేక్ మాట్లాడుతూ.. ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయడమే నా టార్గెట్ అని చెప్పాడు. పవర్‌ప్లేను పూర్తిగా వినియోగించుకోవాలనే ప్రణాళికతోనే తాను, ట్రావిస్ హెడ్ కలిసి బ్యాటింగ్‌కు దిగామని వెల్లడించాడు. అవార్డును తన కుటుంబానికి అంకితం ఇస్తున్నట్లు అభిషేక్ చెప్పాడు.'మేము ఇన్నింగ్స్ ప్రారంభించిన విధానం చూస్తే..స్పష్టమైన ప్రణాళిక ఉందని అనిపించింది. నేను, హెడ్డి (ట్రావిస్ హెడ్) కలిసి పవర్‌ప్లేను పూర్తిగా వినియోగించుకోవాలని ముందే నిర్ణయించుకున్నాం. అయితే క్రీజ్‌లోకి వెళ్లిన తర్వాత పిచ్ కొంచెం నెమ్మదిగా ఉందని గమనించాం. అందుకే మళ్లీ మా ప్లాన్‌ను మార్చుకోవాల్సి వచ్చింది. మ్యాచ్ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఆడాం. నేను ఎప్పటిలానే పవర్‌ప్లేను వినియోగించుకోవాలని ప్రయత్నించాను. ఈ మైదానంలో పరుగులు చేయడం ఎప్పుడూ నాకు ప్రత్యేకంగానే అనిపిస్తుంది. ముందే చెప్పినట్లుగా 20 ఓవర్లు ఆడే వరకు సరైన స్కోర్ ఏంటో తెలియదు. నా మనసులో ఎప్పుడూ ఒకటే ఉంటుంది.. ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేయాలి' అని అభిషేక్ పేర్కొన్నాడు.'జట్టు కోచ్‌లు, కెప్టెన్ ఇచ్చిన స్వేచ్ఛకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పాలి. మైదానంలో మన ఆటను స్వేచ్ఛగా ఆడే అవకాశం ఇవ్వడం చాలా ముఖ్యం. మూడు సంవత్సరాల క్రితం నేను నా ప్రతిభను చూపించాలని అనుకునేవాడిని. పవర్‌ప్లేలో, బౌలర్లపై ధాటిగా ఆడాలనుకునేవాడిని. అయితే కెప్టెన్, కోచ్ మద్దతు చాలా ముఖ్యం. అది నాకు దక్కింది. 2024లో సన్‌రైజర్స్‌లో ఉన్న వాతావరణం మా అందరికీ గేమ్‌చేంజర్‌గా మారింది. అది కేవలం జట్టుగా గెలవడం మాత్రమే కాదు.. యువ ఆటగాళ్లను స్టార్స్ చేయాలనే లక్ష్యం. నేను ఎప్పుడూ ఇలాగే ఆడాలనుకున్నాను. పంజాబ్ జట్టులో కూడా అలాగే ఆడాను. హైదరాబాద్‌లో స్వేచ్ఛగా ఆడుతా' అని అభి చెప్పాడు.'నేను చాలా కాలంగా 'L' సెలబ్రేషన్ చేస్తూనే ఉన్నాను. ఇది స్టేడియం, అభిమానులపై ఉన్న ప్రేమకు సూచిక. టోర్నమెంట్‌లో ప్రేక్షకులు మాకు ఇచ్చే మద్దతు అద్భుతం. హోటల్ దగ్గర కూడా మద్దతు బాగా ఉంటుంది. నా వంతుగా వారికి ప్రేమను చూపించాలనుకుంటాను. ఈ రోజు నా తల్లిదండ్రులు మైదానంలో ఉన్నారు. ఇది చాలా ప్రత్యేకమైన క్షణం. ఐతే నా సోదరి ఈ రోజు ఇక్కడ లేదు. ఇన్‌ఫెక్షన్ కారణంగా హైదరాబాద్ రాలేదు. ఈ ఇన్నింగ్స్ ఆమెకు అంకితం ఇస్తున్నా. అండర్-12 రోజుల నుంచి నా తండ్రి ఎప్పుడూ మ్యాచ్ చూస్తూ ఉంటారు. హైదరాబాద్‌లో కూడా స్టేడియంలోనే ఉంటారు. నేను నాన్-స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్నప్పుడు కూడా ఎలా ఆడాలో సూచనలు ఇస్తుంటారు. ఇప్పటికీ అదే కొనసాగుతోంది. కెమెరాలో నాన్న కనబడితే ఆయన రియాక్షన్స్ చూడటం చాలా సరదాగా ఉంటుంది. నేను ఆయనను చూస్తాను, ఆయన నన్ను చూస్తూ సూచనలు ఇస్తారు. అది నాకు ఎంతో సహాయపడుతుంది. తల్లిదండ్రులు, స్నేహితుల ముందు బాగా ఆడటం ఎప్పుడూ ప్రత్యేకంగానే ఉంటుంది' అని అభి సంతోషం వ్యక్తం చేశాడు.

# వాంఖడేలో హై వోల్టేజ్ పోరు..





ఐపీఎల్ 2026లో భాగంగా వాంఖడేలో హై వోల్టేజ్ పోరుకు రంగం సిద్ధమైంది. గురువారం ముంబై ఇండియన్స్ (ఎంఐ), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) తలపడనున్నాయి. పాయింట్ల పట్టికలో రెండు టీమ్స్ దిగువన ఉండడంతో.. ఈ మ్యాచ్ కీలకంగా మారింది. గెలిచిన టీమ్ ప్లే ఆఫ్స్ రేసులో ఉంటుంది. ఓడిన జట్టుకు మాత్రం ఆశలు సన్నగిల్లుతాయి. ఈ నేపథ్యంలో ఎంఐ, సీఎస్‌కేలు గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగనున్నాయి. ముంబైతో కీలక పోరుకు ముందు చెన్నైకి ఓ గుడ్ న్యూస్. మాజీ కెప్టెన్, టీమిండియా దిగ్గజం ఎంఎస్ ధోనీ మైదానంలోకి దిగే అవకాశాలు ఉన్నాయి.మోకాలి గాయంతో బాధపడుతున్న ఎంఎస్ ధోనీ జట్టుతో పాటే ప్రయాణిస్తున్న విషయం తెలిసిందే. సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్ కోసం భాగ్యనగరం కూడా వచ్చాడు. ఉప్పల్ స్టేడియంలో ఆడుతాడనుకున్నా.. అభిమానులకు నిరాశే ఎదురైంది. అయితే ముంబైలోని వాంఖడే స్టేడియంలో మహీ నెట్స్‌లో ప్రాక్టీస్ చేస్తున్న వీడియో ఒకటి నెట్టింట వైరల్ అయింది. సుమారు అరగంట పాటు వికెట్ కీపింగ్ చేశాడు. మరో అరగంట పాటు బ్యాటింగ్ కూడా చేశాడు. ప్రీ సీజన్‌లో కాల్ఫ్ స్ట్రెయిన్‌తో ఇబ్బంది పడిన ధోనీ.. ఇప్పుడు పూర్తి ఫిట్‌గా కనిపిస్తున్నాడు. అతడు బ్యాటింగ్ చేస్తూ ఎలాంటి ఇబ్బంది లేకుండా బంతులను సులభంగా బౌండరీకి పంపడం అభిమానులకు ఊరటనిచ్చింది. ముంబైపై ధోనీ బరిలోకి దిగుతాడని తెలుస్తోంది. మహీ ఆడడంపై ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ప్రస్తుతం సీఎస్‌కే పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉండటంతో.. ధోనీ రీఎంట్రీ జట్టుకు భారీ బలాన్నిస్తుంది.సీఎస్‌కే జట్టులోకి ఆస్ట్రేలియా పేసర్ స్పెన్సర్ జాన్సన్ చేరాడు. గాయపడిన నాథన్ ఎల్లిస్ స్థానంలో జట్టులోకి వచ్చిన అతడు వాంఖడేలో జట్టుతో కలిసి ప్రాక్టీస్ చేశాడు. ఇటీవల గాయంతో ఖలీల్ అహ్మద్ కూడా దూరమవడంతో.. జాన్సన్‌కు ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే సీఎస్‌కేకు గాయాల సమస్యలు ఇంకా వెంటాడుతున్నాయి. ఇటీవల మ్యాచ్‌లో యువ బ్యాటర్ ఆయుష్ మాత్రే హామ్‌స్ట్రింగ్ గాయంతో ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. దీంతో జట్టులో మార్పులు తప్పనిసరి అయ్యాయి.ముంబై ఇండియన్స్‌కు కూడా ఓ గుడ్ న్యూస్. ఇంగ్లండ్ స్టార్ విల్ జాక్స్ ఎట్టకేలకు జట్టుతో చేరాడు. ఐపీఎల్ 2026 ప్రారంభంలో కొన్ని మ్యాచ్‌లకు దూరమైన జాక్స్.. తాజాగా వాంఖడేలో ప్రాక్టీస్ ప్రారంభించాడు. నెట్స్‌లో బౌలింగ్ చేస్తూ.. గంటకు పైగా బ్యాటింగ్ చేస్తూ తన ఫిట్‌నెస్‌ను చూపించాడు. 2026 టీ20 వరల్డ్ కప్‌లో అద్భుత ప్రదర్శన చేసిన జాక్స్.. ముంబై జట్టుకు కీలక బలం కానున్నాడు. అతడి చేరికతో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలు మరింత బలపడనున్నాయి. జాక్స్ జట్టులోకి రావడంతో విదేశీ ఆటగాళ్ల కాంబినేషన్‌లో మార్పులు రావొచ్చు. అల్లా ఘజన్‌ఫర్ లేదా మిచెల్ సాంట్నర్‌లో ఒకరు చోటు కోల్పోయే అవకాశాలు ఉన్నాయి. మిడిల్ ఆర్డర్‌లో జాక్స్ ఫినిషర్‌గా కూడా కీలక పాత్ర పోషించగలడు.

## ముంబై ఇండియన్స్ జట్టులో చేరిన విధ్వంసకర బ్యాటర్



ఐపీఎల్ 2026లో వరుస ఓటములతో సతమతమైన ముంబై ఇండియన్స్ , గుజరాత్ టైటాన్స్‌పై భారీ విజయం సాధించి ఇప్పుడిప్పుడే ఊపు అందుకుంటోంది. ఈ క్రమంలోనే స్టార్ ఆల్‌రౌండర్ విల్ జాక్స్ జట్టుతో చేరడం ముంబైకి కొండంత అండగా మారింది. అంతర్జాతీయ షెడ్యూల్ వల్ల కాస్త ఆలస్యంగా చేరినప్పటికీ, నిన్న (ఏప్రిల్ 21, 2026) వాంఖడే స్టేడియంలో జాక్స్ నెట్స్‌లో చెమటోడ్చారు. భారీ సిక్సర్లు బాదడమే కాకుండా, తన ఆఫ్ స్పిన్‌తోనూ ఆకట్టుకున్నారు. 2026 టీ20 వరల్డ్ కప్‌లో విల్ జాక్స్ విధ్వంసం సృష్టించారు.ఒకే టోర్నీలో 4 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డులు గెలుచుకుని ఆస్ట్రేలియా దిగ్గజం షేన్ వాట్సన్ రికార్డును సమం చేసిన విషయం తెలిసిందే.. వరల్డ్ కప్‌లో 226 పరుగులు చేయడంతో పాటు 9 వికెట్లు తీసి టాప్ ఫామ్‌లో ఉన్నారు. అలాగే గత సీజన్లో ఆర్సీబీ కప్ గెలవడంతో విల్ జాక్స్ కీలక పాత్ర పోషించాడు. రేపు (ఏప్రిల్ 23, గురువారం) రాత్రి 7:30 గంటలకు వాంఖడేలో జరగనున్న ఐపీఎల్ బ్లాక్‌బస్టర్ మ్యాచ్ లో విల్ జాక్స్ ప్లేయింగ్ ఎలెవన్‌లోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. జాక్స్ రాకతో ముంబై టాప్ ఆర్డర్ మరింత బలోపేతం కానుంది. ఫినిషర్‌గా కూడా రాణించగల సత్తా ఆయన సొంతం. హార్దిక్ సేనలో ఒక విదేశీ స్పిన్ ఆప్షన్ కొరతను కూడా ఆయన తీర్చనున్నాడని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## దంతెవాడకు సచిన్ టెండూల్కర్..



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ ఈరోజు ఛత్తీస్‌గఢ్‌లోని నక్సల్ ప్రభావిత ప్రాంతమైన దంతేవాడలో పర్యటించడం దేశ రాజకీయాల్లో ఆసక్తిగా మారింది. సచిన్ టెండూల్కర్ ఫౌండేషన్, మాన్ దేశి ఫౌండేషన్, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా చేపట్టిన "మైదాన్ కప్" కార్యక్రమంలో భాగంగా సుమారు 50 గ్రామాల్లో క్రీడా మైదానాలను నిర్మించి, 10,000 మందికి పైగా ఆదివాసీ యువతను "గన్స్ నుంచి గ్రౌండ్స్ వైపు" మళ్లించడమే లక్ష్యంగా ఈ పర్యటన సాగుతోంది. ఈ సందర్భంగా పనేడాలో నూతనంగా నిర్మించిన క్రికెట్ స్టేడియంను ప్రారంభించనున్న సచిన్, తన పట్టుదలతో గతంలోనే మాస్టర్ బ్లాస్టర్ మనసు గెలుచుకున్న దివ్యాంగ యువకుడు మద్దారామ్‌ను కూడా ప్రత్యేకంగా కలవనున్నారు. 2020లో నేలపై పాకుతూ క్రికెట్ ఆడుతున్న మద్దారామ్ వీడియోను చూసి చలించిపోయిన సచిన్, అప్పట్లోనే అతనికి క్రికెట్ కిట్ పంపించి ప్రోత్సహించగా, ఇప్పుడు స్వయంగా తన అభిమాన దైవం తన ఊరికే వస్తుండటంతో సచిన్‌తో కలిసి క్రికెట్ ఆడాలన్న మద్దారామ్ కల నెరవేరబోతోంది. ఈ పర్యటన దంతేవాడలోని యువతలో కొత్త ఆశలను చిగురింపజేయడమే కాకుండా, క్రీడల ద్వారా సామాజిక మార్పును తీసుకురావడంలో ఒక గొప్ప మైలురాయిగా నిలిచిపోనుంది.


# బిజినెస్




# నెస్లే ఇండియా 'లాభాల' మేజిక్..

ప్రముఖ ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే ఇండియా 2025-26 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో అదిరిపోయే ఫలితాలను నమోదు చేసింది. మార్చి 2026తో ముగిసిన ఈ త్రైమాసికంలో కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం ఏకంగా 27 శాతం వృద్ధి చెంది రూ. 1,111 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే సమయంలో ఈ లాభం రూ. 873 కోట్లుగా ఉండగా, ఈ ఏడాది మార్కెట్ నిపుణులు అంచనా వేసిన రూ. 926 కోట్లను నెస్టలే భారీ తేడాతో క్రాస్ చేసింది. కేవలం లాభాల్లోనే కాకుండా ఆదాయంలోనూ కంపెనీ 23 శాతం వృద్ధిని సాధించి రూ. 6,748 కోట్ల మార్కును అందుకుంది. ముఖ్యంగా మ్యాగీ, కిట్‌క్యాట్ వంటి బ్రాండ్ల పట్ల వినియోగదారులు చూపిస్తున్న ఆదరణతో దేశీయ అమ్మకాలు మునుపెన్నడూ లేని విధంగా రూ.6,445 కోట్ల రికార్డు స్థాయికి చేరుకున్నాయి.ఈ మెరుగైన ప్రదర్శనకు ప్రధాన కారణం కంపెనీ అనుసరించిన మార్కెటింగ్ వ్యూహాలేనని నెస్లే ఇండియా సీఎండీ మనీష్ తివారీ పేర్కొన్నారు. ఈ త్రైమాసికంలో ప్రకటనల కోసం చేసే ఖర్చును కంపెనీ 50 శాతానికి పైగా పెంచినప్పటికీ, సమర్థవంతమైన నిర్వహణ వల్ల ఎబిటా మార్జిన్లను 26.3 శాతంగా స్థిరంగా ఉంచుకోగలిగింది. అద్భుతమైన వృద్ధిని సాధించిన తరుణంలో వాటాదారులకు కూడా కంపెనీ తీపి కబురు అందించింది. ప్రతి షేరుకు రూ.5 చొప్పున ఫైనల్ డివిడెండ్‌ను బోర్డు సిఫార్సు చేయగా, దీని కోసం జూలై 10వ తేదీని రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది.నెస్లే ప్రకటించిన ఈ బంపర్ ఫలితాలతో స్టాక్ మార్కెట్‌లో ఇన్వెస్టర్లు ఎగబడి షేర్లను కొనుగోలు చేశారు. ఫలితంగా నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కంపెనీ షేరు విలువ 7 శాతం మేర పెరిగి రూ.1,379.90 వద్ద కొత్త 52 వారాల గరిష్ట స్థాయిని తాకింది. స్టాండ్‌లోన్ ప్రాతిపదికన కూడా కంపెనీ లాభం 26 శాతం పెరిగి రూ.1,114 కోట్లుగా నమోదవ్వడం విశేషం. మొత్తం మీద పెరుగుతున్న ముడి సరుకుల ధరల సవాళ్లను అధిగమిస్తూ, భారీ ప్రకటనల ఖర్చు చేసినా లాభదాయకతను కాపాడుకోవడంలో నెస్లే విజయం సాధించింది.

# భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్..




దేశీయ స్టాక్ మార్కెట్ భారీ నష్టాలతో ప్రారంభమైంది. గత రెండ్రోజులు మార్కెట్ భారీ లాభాల్లో ట్రేడ్ అయింది. తాజాగా ఇరాన్-అమెరికా మధ్య నిరవధిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని ట్రంప్ పొడిగించారు. దీంతో మార్కెట్ మంచి జోష్‌లో ఉండాలి. కానీ అందుకు భిన్నంగా బుధవారం మార్కెట్ ప్రారంభమే నష్టాలతో మొదలైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గినప్పటికీ... అంతర్జాతీయంగా బలహీనమైన సంకేతాలు ఉండడంతో పెట్టుబడిదారుల్లో నిరుత్సాహం ఏర్పడింది. దీంతో మార్కెట్ సూచీలు నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.ప్రస్తుతం సెన్సెక్స్ 519 పాయింట్లు నష్టపోయి 78,753 దగ్గర కొనసాగుతుండగా.. నిఫ్టీ 132 పాయింట్లు నష్టపోయి 24, 444 దగ్గర కొనసాగుతోంది. నిఫ్టీలో ట్రెంట్, నెస్లే, హెచ్‌యూఎల్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, జియో ఫైనాన్షియల్ వంటి ప్రధాన షేర్లు లాభపడగా.. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో వంటి షేర్లు నష్టపోయాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఫ్లాట్‌గా ట్రేడవుతున్నాయి.




# జియోహాట్‌స్టార్‌లో కొత్త అడ్వర్టైజింగ్ ట్రెండ్

ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియోహాట్‌స్టార్ అడ్వర్టైజ్‌మెంట్ విభాగంలో కొత్త ట్రెండ్ తీసుకొచ్చింది. ఇప్పటివరకు యూజర్లు ఎలాంటి వీడియోలు చూస్తున్నారనే దాన్ని బట్టి యాడ్స్ కనిపించేవి. దీన్ని మరింత స్మార్ట్‌గా మారుస్తూ, జియోహాట్‌స్టార్ ఇప్పుడు 'సిగ్నల్-ఆధారిత కామర్స్ అడ్వర్టైజింగ్' విధానాన్ని ప్రవేశపెట్టింది. సులభంగా చెప్పాలంటే, యూజర్లు ఏం చూస్తున్నారనే కాదు, తర్వాత ఏం కొనాలనుకుంటున్నారో అర్థం చేసుకుని యాడ్స్ చూపించడం. అడ్వర్టైజ్‌మెంట్ పరిశ్రమలోనే ఇది మొట్టమొదటి ప్రయత్నమని కంపెనీ పేర్కొంది. ఈ విధానానికి తొలి భాగస్వామిగా ఇన్‌స్టామార్ట్ చేరింది. దీనివల్ల యూజర్లు ఫుడ్ వీడియో చూస్తున్నప్పుడు, తక్షణం ఆ ఐటెమ్ ఆర్డర్ చేసే ఆప్షన్ కనిపిస్తుంది. ఈ తరహా టెక్నాలజీ ప్రధాన లక్ష్యం, కస్టమర్లు ఏదైనా చూసి, నచ్చి, కొనడానికి చేసే ప్రయత్నాల మధ్య గ్యాప్ తగ్గించడమని కంపెనీ చెబుతోంది.ఇప్పటివరకు, యూజర్ల వయసు, లొకేషన్ ఆధారంగా యాడ్స్ వచ్చేవి. ఇప్పుడు ఇంటెంట్(కొనాలనే ఆసక్తి) ఆధారంగా యాడ్స్ టార్గెట్ అవుతాయి. దీనివల్ల యాడ్స్ రిలవెంట్‌గా ఉండటమే కాకుండా బ్రాండ్స్‌కు ప్రయోజనాలు లభిస్తాయి. ప్రస్తుతం ఐపీఎల్ సీజన్‌తో పాటు ఈ ఫీచర్‌ను లాంచ్ చేశారు. ఈ సమయంలో కోట్లాది మంది యూజర్లు యాక్టివ్‌గా ఉండటంతో, ఎంటర్‌టైన్‌మెంట్ షాపింగ్‌తో కలిపి ఈ కొత్త ట్రెండ్‌కు జియోహాట్‌స్టార్ శ్రీకారం చుట్టింది.




# ఏఐ ప్రపంచాన్ని షేక్ చేసిన అమెజాన్!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రపంచంలో మరో భారీ డీల్ కుదిరింది. ప్రముఖ ఇ-కామర్స్, క్లౌడ్ దిగ్గజం అమెజాన్, ఏఐ స్టార్టప్ ఆంత్రోపిక్‌లో ఏకంగా 25 బిలియన్ డాలర్ల (సుమారు రూ.2.10 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. ఈ ఒప్పందంతో ఏఐ రంగంలో ఆధిపత్యం కోసం జరుగుతున్న పోటీ మరింత ముదిరింది. ఈ భారీ డీల్ ముఖ్యాంశాలు ఏంటో ఈ స్టోరీలో తెలుసుకుందాం.

### అమెజాన్ - ఆంత్రోపిక్ డీల్ విశేషాలు ఇవే..

అమెజాన్ ప్రస్తుతం 5 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెడుతుండగా, భవిష్యత్తులో మైలురాళ్లను బట్టి మరో 20 బిలియన్ డాలర్లు అందించనుంది. ఇదివరకు అమెజాన్ పెట్టిన 8 బిలియన్ డాలర్ల పెట్టుబడికి ఇది అదనం. దీనికి ప్రతిగా ఆంత్రోపిక్ సంస్థ రాబోయే పదేళ్లలో అమెజాన్ క్లౌడ్ టెక్నాలజీస్‌పై 100 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ ఖర్చు చేయాలని నిర్ణయించుకుంది. ఆంత్రోపిక్ తన తదుపరి ఏఐ మోడల్స్ శిక్షణ కోసం అమెజాన్ స్వయంగా తయారు చేసిన 'ట్రైనియం' చిప్స్‌ను ఉపయోగించనుంది.

### ఏఐ రేసులో అమెజాన్ వ్యూహం..

అమెజాన్ తన సొంత ఏఐ మోడల్స్ (ఉదాహరణకు 'నోవా') తో పెద్దగా గుర్తింపు పొందలేకపోయినా, ఇన్ఫ్రాస్ట్రక్చర్ (క్లౌడ్ సేవలు) పరంగా తిరుగులేని శక్తిగా ఎదగాలని చూస్తోంది. ఈ ఏడాది అమెజాన్ ఏఐ మౌలిక సదుపాయాల కోసం దాదాపు 200 బిలియన్ డాలర్ల మూలధన వ్యయం చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. కేవలం ఆంత్రోపిక్ మాత్రమే కాకుండా, ఈ ఏడాది ప్రారంభంలో ఓపెన్ ఏఐలో కూడా 50 బిలియన్ డాలర్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు అమెజాన్ ప్రకటించడం గమనార్హం. ఓపెన్ ఏఐ మాజీ పరిశోధకులు 2021లో స్థాపించిన ఆంత్రోపిక్.. తన 'క్లాడ్' ఏఐ మోడల్స్‌తో అతి తక్కువ కాలంలోనే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. ప్రస్తుతం ఆంత్రోపిక్ వార్షిక ఆదాయం 30 బిలియన్ డాలర్ల మార్కును దాటినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఈ సంస్థ కేవలం అమెజాన్‌తోనే కాకుండా మైక్రోసాఫ్ట్ (5 బిలియన్ డాలర్ల పెట్టుబడి), గూగుల్‌తో కూడా భాగస్వామ్యాలను కలిగి ఉంది.ఈ భారీ పెట్టుబడి ప్రకటనతో అమెజాన్ షేర్లు ట్రేడింగ్‌లో సుమారు 2.7% పెరిగాయి. ఆంత్రోపిక్ ఈ ఏడాది చివరలో ఐపీఓకు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో, అమెజాన్ తీసుకున్న ఈ నిర్ణయం ఏఐ మార్కెట్లో దాని స్థానాన్ని మరింత బలపరిచిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.









# డ్రాగన్ తేదీ ఫిక్స్ వెనక స్ట్రాంగ్ స్ట్రాటజీ

జూనియర్ ఎన్టీఆర్ -- ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో ఓ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఈ చిత్రానికి అధికారికంగా టైటిల్‌ను ప్రకటించలేదు. అయితే 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. తాజాగా ఈ మూవీ బృందం ఈ సినిమాను 2027 జూన్ 11వ తేదీన విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమా ప్రారంభమై చాలా కాలం గడిచింది. ఇక విడుదల తేదీ కూడా చాలా ఆలస్యంగా ఉండడంతో, ఇంత దూరంగా రిలీజ్ డేట్ ఎందుకు పెట్టారనే సందేహం కొంతమందిలో వ్యక్తమవుతోంది. అయితే ఒక అద్భుతమైన ప్లానింగ్‌తోనే ఈ మూవీ బృందం ఈ విడుదల తేదీని ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అది ఎలా అనుకుంటున్నారా? ఈ మూవీ 2027 జూన్ 11, శుక్రవారం రోజున విడుదల కానుంది. సినిమా విడుదల రోజు కావడంతో సహజంగానే ఆ రోజు భారీ ఓపెనింగ్స్ వచ్చే అవకాశం ఉంది. అదే రోజు మంచి టాక్ వచ్చినట్లయితే, వెంటనే వచ్చే రెండు రోజులు వీకెండ్ కావడం ఈ సినిమాకు ప్లస్ అవుతుంది. అలాగే 5వ రోజు మొహర్రం పండుగ హాలిడే కూడా ఈ చిత్రానికి కలిసి రానుంది. దాంతో పాటు తర్వాత వచ్చే మరో వీకెండ్ కూడా ఈ సినిమాకు అదనపు ప్రయోజనంగా మారనుంది. ఇలా సినిమా విడుదలైన తర్వాత మొదటి పది రోజుల్లో దాదాపు ఆరు రోజులపాటు మంచి హాలిడేస్ ఈ చిత్రానికి దొరకనున్నాయి. అందుకే మూవీ యూనిట్ కాస్త దూరంగా ఉన్న ఈ తేదీని ఎంచుకున్నట్లు సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




# రణ్‌బీర్ లైనప్.. సందీప్ రెడ్డికి ఎఫెక్ట్



## కోట్లల్లో రెమ్యూనరేషన్ ?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బుచ్చిబాబు దర్శకత్వంలో వస్తున్న సినిమా పెద్ది. స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ లో ఈ సినిమా తెరకెక్కుతోంది. షూటింగ్ ఆలస్యం కావడంతో ఈ సినిమా రిలీజ్ వాయిదా పడింది. పెద్ది ఆలస్యంగా రిలీజ్ కావడానికి ముఖ్య కారణం స్పెషల్ సాంగ్ అని తెలుస్తోంది. ఈ పాటను మరో ఆరు రోజుల్లో ఫినిష్ చేసి...షూటింగ్ కు ప్యాకప్ చెప్పబోతున్నారట. పెద్ది సినిమాలో ఐటమ్ సాంగ్ చేసేందుకు మలయాళ ముద్దుగుమ్మ సంయుక్త మీనన్ ఫైనల్ అయినట్లు నడుస్తోంది. ఈ మూవీలో ఐటెం సాంగ్ చేసినందుకు దాదాపు మూడు కోట్లు వసూలు చేస్తోందట ఈ అందాల తార. స్టార్ హీరోయిన్ గా కొనసాగుతున్న నేపథ్యంలో ఆ రేంజ్ వరకు సంయుక్తకు ఇచ్చేందుకు చిత్ర బృందం కూడా వెనకడుగు వేయలేదని సమాచారం. ఇక బుధవారం నుంచి వనస్థలిపురంలో ఈ సాంగ్ షూట్ ప్రారంభం కానున్నట్లు ఇండస్ట్రీలో టాక్ నడుస్తోంది. రామ్ చరణ్ మాస్ డాన్స్ కు, సంయుక్త గ్లామర్ తోడవడంతో ఈ సాంగ్ హైలెట్ గా నిలుస్తుందని అంటున్నారు. కాగా మైత్రి మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఇందులో శివ రాజ్ కుమార్, జగపతి బాబు తదితరులు నటిస్తున్నారు. ఈ సినిమాకు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తున్నారు.

ఏదైనా సినిమా అనుకున్న సమయానికి ప్రారంభం కావాలంటే హీరో, దర్శకుడు, నిర్మాతల సహకారం పూర్తిగా ఉండాల్సిందే. వారిలో ఎవరి సహకారం లేకపోయినా, తేదీలు అడ్జస్ట్ కాకపోయినా సినిమా సమయానికి పట్టాలెక్కే అవకాశాలు ఉండవు. ఇలాంటి పరిస్థితే ప్రస్తుతం దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కు ఎదురయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 'అర్జున్ రెడ్డి' సినిమాతో దర్శకుడిగా కెరీర్‌ను ప్రారంభించిన ఈయన, ఇప్పటివరకు అపజయం ఎరుగని దర్శకుడిగా కొనసాగుతున్నాడు. కొంతకాలం క్రితం ఈయన రణ్‌బీర్ కపూర్ హీరోగా రూపొందించిన 'యానిమల్' చిత్రం దాదాపు 900 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించి భారీ విజయాన్ని అందుకుంది. ప్రస్తుతం సందీప్ రెడ్డి వంగా, ప్రభాస్ హీరోగా 'స్పిరిట్' చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాడు. ఈ సినిమా పూర్తయ్యాక రణ్‌బీర్ కపూర్ హీరోగా 'యానిమల్ పార్క్' చిత్రాన్ని ప్రారంభించాలని భావించాడు. రణ్‌బీర్ కూడా ఈ సినిమాను ప్రారంభించడానికి ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే రణ్‌బీర్ కపూర్ కమిట్ అయిన చిత్రాల కారణంగా 'యానిమల్ పార్క్' ఆలస్యమయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ నటుడు 'రామాయణ' చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుంది. మొదటి భాగం ఈ దీపావళికి, రెండో భాగం వచ్చే దీపావళికి విడుదల కానున్నాయి. ఇక ఇప్పటికే ఈ నటుడు 'బ్రహ్మాస్త్ర 2', 'ధూమ్ 4' చిత్రాలకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ రెండు సినిమాల చిత్రీకరణకు కూడా చాలా సమయం పట్టే అవకాశం ఉంది. దాంతో ఈ సినిమాల అనంతరం 'యానిమల్ పార్క్' షూటింగ్ ప్రారంభమైతే అప్పటికి చాలా సమయం గడిచిపోయే అవకాశం ఉంది. మరి రణ్‌బీర్ కపూర్ ప్రస్తుతం కమిట్ అయిన సినిమాలు పూర్తి చేసిన తర్వాత సందీప్ రెడ్డి వంగాతో సినిమా చేస్తాడా? లేక ఆ సినిమాలు పూర్తయ్యే వరకు అర్జున్ రెడ్డి దర్శకుడు వెయిట్ చేస్తాడా? అనేది ఇప్పుడు ఇండస్ట్రీలో ఆసక్తికరంగా మారింది.

# 'కల్కి 2' షూటింగ్‌లో బిగ్ అప్‌డేట్..



రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన 'కల్కి 2898 ఏడీ' ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించి ప్రభంజనం సృష్టించింది. ఈ సినిమా క్లైమాక్స్‌లో భైరవ పాత్రలోని కర్ణుడి కోణాన్ని ఆవిష్కరించడంతో, సీక్వెల్‌పై అంచనాలు ఆకాశాన్ని తాకాయి. నిర్మాత అశ్వినీదత్ వైజయంతీ మూవీస్ బ్యానర్‌పై ఎలాంటి కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అయితే తాజాగా ఈ మూవీ సీక్వెల్ షూటింగ్ గురించి ఒక అదిరిపోయే వార్త ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. 'కల్కి 2' కొత్త షెడ్యూల్ కోసం చిత్ర యూనిట్ హైదరాబాద్‌లో ఒక భారీ సెట్‌ను నిర్మిస్తోందట. ఈ సెట్‌లో సినిమాకే హైలైట్‌గా నిలిచే ఇంటర్వెల్ బ్లాక్ను షూట్ చేయనున్నారని తెలుస్తోంది. అత్యంత కీలకమైన ఈ సన్నివేశంలో ప్రభాస్‌తో పాటు బిగ్ బి అమితాబ్ బచ్చన్ (అశ్వత్థామ), లోకనాయకుడు కమల్ హాసన్ (సుప్రీమ్ యాస్కిన్) కూడా పాల్గొంటారట. ముగ్గురు దిగ్గజ నటులు ఒకే ఫ్రేమ్‌లో కనిపించే ఈ ఇంటర్వెల్ సీన్ ప్రేక్షకులకు గూస్ బంప్స్ తెప్పించడం ఖాయం. సీక్వెల్‌కు సంబంధించి మరో ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ ఏమిటంటే..దీనికి 'కర్ణ 3102 బీసీ' అనే టైటిల్‌ను మేకర్స్ పరిశీలిస్తున్నట్లు టాక్. మొదటి భాగంలో కల్కి ఆగమనం గురించి చెబితే, రెండో భాగంలో కర్ణుడి పునరాగమనం, ద్వాపర యుగంలోని కీలక ఘట్టాలను ఎక్కువగా చూపించబోతున్నారట. సీక్వెల్‌లో మైథాలజీ లెంగ్త్ మొదటి భాగం కంటే చాలా ఎక్కువగా ఉంటుందని, కథ మొత్తం కర్ణుడి పాత్ర చుట్టూనే తిరుగుతుందని సమాచారం.

# దర్శకుడు చిట్టిబాబు కన్నుమూత!



తెలుగు చిత్రసీమలో మరో విషాదం చోటుచేసుకుంది. బహుముఖ ప్రజ్ఞాశాలి, ప్రముఖ నటుడు, నిర్మాత, దర్శకుడు, బీజేపీ నేత త్రిపురనేని చిట్టిబాబు (71) బుధవారం అర్ధరాత్రి కన్నుమూశారు. గత రాత్రి ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు హైటెక్ సిటీలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో టాలీవుడ్ ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనైంది. లెజెండరీ రచయిత త్రిపురనేని మహారథి (అల్లూరి సీతారామరాజు, సింహాసనం ఫేమ్) కుమారుడైన చిట్టిబాబు అసలు పేరు వరప్రసాద్. 1955లో కృష్ణా జిల్లాలో జన్మించిన ఆయన, చెన్నైలో విద్యాభ్యాసం పూర్తి చేశారు. అప్పలాచార్య, ఆత్రేయ వంటి గొప్ప రచయితల వద్ద శిష్యరికం చేసి సినిమా రంగంపై పట్టు సాధించారు. మోహన్ బాబు ప్రోత్సాహంతో 'సంతానం' సినిమాతో దర్శకుడిగా మెగాఫోన్ పట్టుకున్న ఆయన, సుమారు 12 సినిమాలకు దర్శకత్వం వహించారు. నటుడిగా సౌందర్య ప్రస్థానంలో చిట్టిబాబు పాత్ర మరువలేనిది. కృష్ణ, భానుచందర్ ప్రధాన పాత్రల్లో ఆయన నిర్మించిన చిత్రంలో సౌందర్యను సెకండ్ హీరోయిన్ గా తీసుకుని వెండితెరకు పరిచయం చేశారు. ఆ తర్వాత ఆమె టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఎదిగింది. నటుడిగా కూడా ఆయన తన ముద్ర వేశారు. ముఖ్యంగా కృష్ణవంశీ దర్శకత్వంలో వచ్చిన 'రాఖీ' సినిమాలో ఆయన పోషించిన నెగిటివ్ రోల్ ప్రేక్షకులకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. సుమారు 30 సినిమాల్లో నటించి, 50 చిత్రాలకు కో-డైరెక్టర్‌గా పనిచేశారు.





# ఇమ్రాన్‌తో కెమిస్ట్రీ అదిరిపోవాల్సిందే!




బాలీవుడ్ గ్లామర్ క్వీన్ దిశా పటానీ ఇప్పుడు ఒక సెన్సేషనల్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమైంది. ఇమ్రాన్ హాష్మీ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన 'ఆవారాపన్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'ఆవారాపన్ 2'లో దిశా హీరోయిన్‌గా నటిస్తోంది. 'ఆవారాపన్ 2' చిత్రంలో దిశా పటానీ భాగం కావడంతో సినిమా స్థాయి మరింత పెరిగిందని చిత్ర బృందం భావిస్తోంది. నిర్మాత విశేష్ భట్ మాట్లాడుతూ.. "దిశా పటానీ ఈ ప్రాజెక్ట్‌లో చేరడం వల్ల 'ఆవారాపన్' ప్రపంచం సరికొత్త అవకాశాలకు వేదికైంది" అని ప్రశంసించారు. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, ఇమ్రాన్ హాష్మీ సరసన అత్యంత పవర్‌ఫుల్, ఎమోషనల్ పాత్రలో దిశా మెరిసిపోనుంది. వీరిద్దరి మధ్య ఉండే కెమిస్ట్రీ, దిశా యాక్షన్ సీక్వెన్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని సమాచారం. ఇమ్రాన్ హాష్మీ సినిమాలంటేనే పాటలు ఒక రేంజ్‌లో ఉంటాయి. ఈ సీక్వెల్‌లో కూడా దిశా పటానీపై చిత్రీకరించే పాటలు మళ్ళీ పాత 'ఆవారాపన్' మ్యాజిక్‌ను తీసుకువస్తాయని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. నితిన్ కక్కర్ దర్శకత్వంలో రాబోతుంది. విశేష్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ డ్రామా ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కాబోతోంది. స్వాతంత్ర్య దినోత్సవ వీకెండ్‌లో విడుదలవుతున్న ఈ సినిమాకు బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ ఎదురుకానుంది. సన్నీ డియోల్ నటించిన 'లాహోర్ 1947' ఆగస్టు 13న విడుదల కాబోతుండగా, మరుసటి రోజే దిశా తన 'ఆవారాపన్ 2'తో థియేటర్లలోకి రానుంది. ఒకవైపు సన్నీ డియోల్ మాస్ పవర్, మరోవైపు దిశా పటానీ గ్లామర్ అండ్ యాక్షన్.. ఈ పోటీ బాలీవుడ్‌లో ఆసక్తికరంగా మారింది.

# మంచం కింద ఇద్దరు హీరోలు..



ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్, హీరోయిన్లపై వేధింపుల గురించి ఎప్పుడూ వింటూనే ఉంటాం. అయితే, తాజాగా నటుడు జేడీ చక్రవర్తి ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కు ఎదురైన భయంకరమైన అనుభవాన్ని పంచుకుంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఫిల్మ్ నగర్‌లో కలకలం రేపుతున్నాయి. జేడీ చక్రవర్తి మాటల్లో "అప్పుడు నేను విలన్‌గా చిన్న పాత్రలు చేస్తున్నాను. ఒక హీరోయిన్ నాకు, నటుడు సురేష్‌కు మంచి ఫ్రెండ్. ఒకరోజు ఆమె మమ్మల్ని డిన్నర్ కోసం గెస్ట్ హౌస్‌కు పిలిచింది. మేం అక్కడ ఉండగా రాత్రి 8:30 గంటల సమయంలో ఎవరో కాలింగ్ బెల్ కొట్టారు. బయట ఉన్న వ్యక్తిని చూడగానే ఆ హీరోయిన్ భయంతో వణికిపోయింది. వెంటనే మమ్మల్ని మంచం కింద దాక్కోమని బ్రతిమాలింది. "మంచం కింద మేం ఉన్నాం.. పైన ఆ హీరోయిన్, లోపలికి వచ్చిన ఆ ప్రొడ్యూసర్ మధ్య జరిగిన సంభాషణ విని మాకు షాక్ తగిలింది. వచ్చిన వ్యక్తికి ఆ అమ్మాయికి తాత అంత వయసు ఉంటుంది. కనీసం సరిగ్గా నడవలేని స్థితిలో ఉన్న ఆ ముసలి ప్రొడ్యూసర్, ఆ హీరోయిన్ పట్ల ప్రవర్తించిన తీరు, మాట్లాడిన మాటలు చాలా అసభ్యంగా ఉన్నాయి. అతను వెళ్లిన తర్వాత మేం బయటకు వస్తే, ఆ హీరోయిన్ నవ్వుతూ కనిపించింది. కానీ మా కళ్లలో నీళ్లు తిరిగాయి." ఆ హీరోయిన్ తమతో అన్న మాటలను జేడీ గుర్తు చేసుకుంటూ.. "వాడు ముసలోడ్రా.. వాడి దగ్గర భరించలేని వాసన వస్తోంది. కానీ ఏం చేస్తాం? వాడు పెద్ద ప్రొడ్యూసర్.. ఇండస్ట్రీలో ఉండాలంటే తప్పదు కదా" అని ఆమె నవ్వుతూనే తన బాధను చెప్పుకుందని జేడీ ఆవేదన వ్యక్తం చేశారు. ఏ అమ్మాయి కూడా ఇష్టపడి ఇలాంటి పనులు చేయదని, పరిస్థితులు మరియు అవకాశాల కోసం చేసే పోరాటంలో ఇలాంటి దారుణాలను భరించాల్సి వస్తుందని జేడీ చక్రవర్తి కుండబద్దలు కొట్టారు.

# నాకైతే తెలియదు

సాధారణంగా వివాదాలకు దూరంగా ఉండే హీరోయిన్ హన్సిక, సినిమా ఇండస్ట్రీలోని చీకటి కోణం 'క్యాస్టింగ్ కౌచ్'పై స్పందించిన తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పరిశ్రమలో ఎంతోమంది నటీమణులు తమకు ఎదురైన చేదు అనుభవాలను పంచుకుంటూ పోరాడుతుంటే, హన్సిక మాత్రం సింపుల్ గా 'నాకైతే తెలియదు' అని దాటవేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో హోస్ట్ క్యాస్టింగ్ కౌచ్ గురించి ప్రశ్నించగా.. హన్సిక మాట్లాడుతూ.. 'నిజంగా పని చేయలని మనస్ఫూర్తిగా అనుకునే వారికి, నిజమైన టాలెంట్ ఉన్న వారికి ఇలాంటివి ఎదురవుతాయని నేను అనుకోను. నా విషయంలో ఎప్పుడూ ఇలా జరగలేదు' అని చెప్పుకొచ్చింది. పరిశ్రమలో ఇలాంటివి జరుగుతున్నాయన్నది వాస్తవం కదా అని హోస్ట్ గుర్తు చేసినా కూడా.. 'దాని గురించి నాకు అవగాహన కూడా లేదు, కాబట్టి నేను కామెంట్ చేయలేను' అని ఆమె ఆ విషయాన్ని విస్మరించింది. ఈ మాటలు కాస్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో..నెటిజన్లు ఆమెపై మండిపడుతున్నారు. 'మీకు డయబెటీస్ లేనంత మాత్రాన, అసలు ఆ వ్యాధే లేదని చెప్పడం ఎంత మూర్ఖత్వమో మీ మాటలు కూడా అలాగే ఉన్నాయి' అని ఒక యూజర్ ఘాటుగా స్పందించారు. అంతే కాదు టాలెంట్ ఉంటే ఇలాంటివి జరగవు అని అనడం ద్వారా, బాధితులను హన్సిక అవమానిస్తోందని మరికొందరు మండిపడుతున్నారు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ మొదలుపెట్టి ఒక రక్షణ వలయంలో ఉండటం వల్లే హన్సికకు బయటి ప్రపంచం తెలియడం లేదని విమర్శలు వస్తున్నాయి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**